Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 75 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 ఏప్రిల్ 2023 శుక్రవారం పేజీలు : 4

## మళ్లీ అధ్యక్ష ఎన్నికల బరిలోకి ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగనున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల కోసం ట్రంప్ పత్రాలను తాజాగా దాఖలు చేశారు.ట్రంప్ 2024వ సంవత్సరంలో మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి తన అభ్యర్థిత్వాన్ని స్థాపించడానికి పత్రాలను దాఖలు చేశారు. అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. అమెరికా సెనేట్‌లోని 50 స్థానాల్లో, రిపబ్లికన్లు 49 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారని వాషింగ్టన్ పోస్ట్ నివేదించింది.అమెరికా హౌస్‌లో 217 స్థానాల్లో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు 207 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.అధ్యక్ష ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ట్రంప్ గత కొన్ని నెలలుగా సంకేతాలు ఇస్తున్నారు. ఇటీవల అయోవాలో జరిగిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడుతూ తాను మళ్లీ పోటీ చేస్తానని ప్రకటించారు.డొనాల్డ్ ట్రంప్ 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో యూఎస్ ప్రెసిడెంట్ జో బిడెన్ చేతిలో ఓడిపోయారు.





# బీజేపీపై ఆట మొదలెట్టిన బీఆర్ఎస్

# కేసీఆర్ ఇక తగ్గేదేలే!!

హైదరాబాద్ : బిజెపిని ఆత్మ రక్షణలోకి నెట్టేలా కెసిఆర్ నయా వ్యూహాన్ని అమలు చేయబోతున్నారు. ఏదైనా తప్పు దొరికినప్పుడు బిజెపి మీనమేషాలు లెక్కిస్తుందేమో కానీ, బిఆర్ఎస్ అలా కాదు అని బండి సంజయ్ అరెస్టుతో స్పష్టంగా చెప్పింది బీఆర్ఎస్. ఇక ఇదే క్రమంలో రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో బిజెపిని ఆత్మరక్షణ లోకి నెట్టి బలంగా ఎదురు దాడి చేయాలని నిర్ణయం తీసుకుంది. బిఆర్ఎస్ పార్టీని ఇరకాటంలో పెట్టాలని ఢిల్లీ లిక్కర్ స్కామ్, సుఖేష్ చంద్రశేఖర్ కేసు, టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసును వాడుకుంటున్న బిజెపికి బలంగా సమాధానం చెప్పడానికి బిఆర్ఎస్ రెడీ అయింది. రాష్ట్రంలో బిజెపి నాయకులను ఉక్కిరిబిక్కిరి చేయాలని నిర్ణయించుకున్న బీఆర్ఎస్ తన వ్యూహంలో భాగంగా బిజెపి స్లీపర్ సెల్స్ పై నిఘా పెట్టాలని, వారి వ్యూహాలను ఎప్పటికప్పుడు ముందే గుర్తించి ప్రజాక్షేత్రంలో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని భావిస్తుంది. ఎదురుదాడికి రెడీ అయ్యింది. బిజెపి తో పాటు బిజెపి అనుబంధ సంఘాలు కూడా క్షేత్రస్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి ప్రజలలో వ్యతిరేకతను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాయి.

ఇక కేంద్ర నాయకత్వం అప్పగిస్తున్న వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ కేంద్రం వ్యూహాలను అమలు చేయడంలో భాగంగా క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ఇక ఇదే విషయాన్ని గుర్తించిన బి ఆర్ ఎస్ అధినేత కెసిఆర్ రానున్న రోజుల్లో ప్రజలలో భావోద్వేగాలను రెచ్చగొట్టి, అధికార పార్టీని ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉందని నివేదికల ద్వారా గుర్తించారు. ఈ క్రమంలో బిజెపి దూకుడుకు చెక్ పెట్టేలాగా తెలంగాణ రాష్ట్రంలో బిజెపి కోసం స్లీపర్ సెల్స్ లాగా పని చేసే వారి పైన నిఘా పెట్టాలని నిర్ణయించారు. గతంలో జిహెచ్ఎంసి ఎన్నికల సమయంలో కూడా కొన్ని డివిజన్లలో స్లీపర్ సెల్స్ పనిచేశాయని బిఆర్ఎస్ పార్టీలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇక బీఆర్ఎస్ యొక్క బలాలను, బలహీనతలను అంచనా వేస్తూ అందుకు తగ్గట్టుగా స్లీపర్ సెల్స్ బిజెపికి అనుకూలంగా వ్యూహాలను రూపొందిస్తున్నట్టు, వాటిని బీజేపీకి అనుకూలంగా ఉన్న వారితో అమలు చేస్తున్నట్టు గుర్తించిన బీఆర్ఎస్ పార్టీ బిజెపి వ్యూహాలకు చెక్ పెట్టాలని నిర్ణయం తీసుకుంది . కరీంనగర్ జైలుకు బండి సంజయ్ తరలింపు: అరెస్టుపై ఎంపీ సతీమణి ఏమన్నారంటే? ఇందులో భాగంగానే ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో అసలు ఏ విధంగా ప్రశ్నాపత్రాలు బయటకు వచ్చాయి అన్నదానిపై బిఆర్ఎస్ మంత్రులతో పెద్ద ఎత్తున బిజెపి పై ఎదురుదాడి చేయించింది. అంతేకాదు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ను జైలుకు పంపించింది. భవిష్యత్ లో కూడా ఇదే తరహా పోరాటం చెయ్యాలని భావిస్తుంది.

## ఐటీ సిటీ - టెంపుల్ సిటీ వందేభారత్ రెడీ : ప్రధాని మోదీ షెడ్యూల్ ఇలా..!!

హైదరాబాద్ : ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన ఖరారైంది. అధికారికంగా షెడ్యూల్ ప్రకటించారు. అధికారిక కార్యక్రమాలతో పాటుగా బహిరంగసభలోనూ ప్రధాని పాల్గొంటారు. తెలుగు రాష్ట్రాల్లో మూడు నెలల కాలంలోనే రెండో వందేభారత్ ను ప్రధాని ప్రారంభించనున్నారు. కొత్తగా 13 ఎంఎంటీఎస్ సేవలను ప్రధాని ఆవిష్కరిస్తారు. దీంతో పాటుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ప్రారంభిస్తారు. పెరేడ్ గ్రౌండ్ నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. అనంతరం గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తారు.

**రెండో వందేభారత్ సిద్ధం:** సంక్రాంతి నాడు తెలుగు రాష్ట్రాల్లో తొలి వందేభారత్ సికింద్రాబాద్ – విశాఖ మధ్య ప్రధాని ప్రారంభించారు. ఏప్రిల్ 8 వ తేదీ ఉదయం 11:30 గంటలకు మోదీ హైదరాబాద్ లోని బేగంపేటకు చేరుకుంటారు. ఉదయం 11:45 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకొని వందేభారత్ రైలును ప్రారంభిస్తారు. మూడు నెలల సమయంలోనే తెలుగు రాష్ట్రాల్లో మరో వందేభారత్ ప్రారంభం కానుంది. సికింద్రాబాద్ – తిరుపతి వందేభారత్ ఐటీ సిటీ – టెంపుల్ సిటీని కలపనుంది. రూ 720 కోట్లతో ప్రపంచ స్థాయి సౌకర్యాలు, సుందరీకరణతో రూపొందిస్తున్న సికింద్రబాద్ ఐకానిక్ రైల్వే స్టేషన్ భవనానికి ప్రధాని మోదీ ఈ పర్యటనలో శంకుస్థాపన చేయనున్నారు. రూ 11,300 కోట్ల పనులకు శంకుస్థాపన: మధ్యాహ్నం 12:15 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. పరేడ్ గ్రౌండ్ నుండి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఈ పర్యటనలో మొత్తంగా రూ 11,300 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అందులో భాగంగా హైదరాబాద్ – సికింద్రాబాద్ విభాగంలో 13 కొత్త మల్టీ మోడల్ ట్రాన్స్ పోర్ట్ సర్వీసు సేవలను ప్రధాని ప్రారంభిచనున్నారు. చిరుతపులిని చంపి తిన్న పులిబీ జాతి వైరంబీ ఫోటోలు వైరల్!! సికింద్రాబాద్ – మహబూబ్ నగర్






ప్రాజెక్టు డబ్లింగ్, విద్యుదీకరణ పనులను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఏయిమ్స్ కు ఉన్న 201.65 ఎకరాల స్థలంలో రూ 1,365.95 కోట్ల వ్యయంతో 750 పడకల ఆస్పత్రి, 20 భవన సముదాయయంతో పాటుగా ఇతర వసతులు కల్పించనున్నారు. బహిరంగ సభలో ప్రధాని మోదీ: పరేడ్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించనునారు. ప్రస్తుతం రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రధాని రాజకీయంగా ఏం మాట్లాడబోతున్నారనేది ఆసక్తి కరంగా మారుతోంది. ప్రస్తుతం రిమాండ్ లో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ కు దారి తీసిన పరిణామాలపైనా ప్రధాని ఆరా తీసారు. బెయిల్ పైన సంజయ్ ను బయటకు తీసుకొచ్చేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బీఆర్ఎస్ వర్సస్ బీజేపీ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ క్రమంలో ప్రధాని ఈ పర్యటనలో పార్టీ నేతలకు ఎన్నికల దిశగా కీలక దిశా నిర్దేశం చేసే అవకాశం కనిపిస్తోంది.

## కర్ణాటక ఎన్నికల్లోకి తెలంగాణ పార్టీ

హైదరాబాద్ : ఎంఐఎం.. హైదరాబాద్ లో పుట్టిన ఈ పార్టీ దేశవ్యాప్తంగా విస్తరించింది. ఇప్పటికే మహారాష్ట్ర బీహార్యూపీ గుజరాత్ సహా ముస్లిం జనాభా ఎక్కడ అధికంగా ఉంటే ఆ ప్రాంతంలో పోటీచేస్తూ గెలుస్తూ వస్తోంది. ఇప్పుడు పక్క రాష్ట్రం కర్ణాటకపై కన్నేసింది. అక్కడ బరిలోకి సన్నాహాలు చేస్తోంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో అక్కడ ఎన్నికల సందడి మొదలైంది. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడానికి మరో పార్టీ సిద్ధమైపోయింది. ఇప్పటికే హైదరాబాద్ తోపాటు తెలంగాణ ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్న అసదుద్దీన్ ఓవైసీకి చెందిన ఎంఐఎం పార్టీ కర్ణాటకలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 25 చోట్ల పార్టీ అభ్యర్థులను దింపడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. కర్ణాటక కు చెందిన ఎంఐఎం పార్టీ సీనియర్ నేత ఒస్మాన్ ఘని మీడియాతో మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మా పార్టీ బలంగా ఉన్న 25 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీచేస్తారని ఘని మీడియాకు తెలిపారు. జేడీఎస్ పార్టీతో పొత్తు పెట్టుకొని కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తోందని.. ఇప్పటికే మాజీ ప్రధాని దేవెగౌడతో చర్చలు జరి



పామని ఘని వివరించారు. అయితే జేడీఎస్ తో పొత్తు విషయంలో ఎలాంటి క్లారిటీ రాలేదని.. వేచిచూస్తున్నట్టు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. జేడీఎస్ తో పొత్తు ఉన్నా లేకున్నా కర్ణాటకలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ ఖచ్చితంగా పోటీచేస్తుందని.. ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల పేర్లను మా పార్టీ ప్రకటించిందని ఘని వివరించారు. ఇక ఎంఐఎం పార్టీ పోటీతో కాంగ్రెస్ కే నష్టమని భావిస్తున్నారు. ముస్లిం ఓట్లు చీలిపోయి బీజేపీకి లాభం కలుగుతుందని పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. కర్ణాటకలో ముస్లింలకు కేటాయించిన 4శాతం రిజర్వేషన్ ను బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం రద్దు చేసినప్పుడు ఎందుకు ఆందోళన చేయలేదని.. ఎందుకు మౌనంగా ఉండిపోయారని ఎంఐఎం పార్టీ నాయకులు ప్రశ్నించారు. 2018లో జేడీఎస్ తో పొత్తు పెట్టుకున్న ఎంఐఎం పార్టీ ఆ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పోటీ చేయలేదు. అయితే 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ ఖచ్చితంగా పోటీచేస్తుందని ఆ పార్టీ నాయకులు క్లారిటీ ఇచ్చారు.

# వాళ్ళు మాటలు చెబితే.. మనం చేసి చూపిస్తున్నాం

## బిజెపిపై పంచులు విసిరిన మంత్రి హరీశ్ రావు




నాలుగేండ్ల క్రితం వచ్చిన మెడికల్ కాలేజీకి ఇప్పుడు కొబ్బరికాయ కొట్టడం ఎందుకు అని మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రధాని మోదీ తెలంగాణకు వస్తున్నారట.. నాలుగేళ్ల క్రితం వచ్చిన ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి ఇప్పుడు కొబ్బరి కాయ కొడతారట అని విమర్శించారు. ఒక్క మెడికల్ కాలేజీకి నాలుగేళ్ల తర్వాత కొబ్బరి కాయ కొడితే.. మేం గతేడాది ఒకే సారి 8 మెడికల్ కాలేజీలకు కొబ్బరికాయలు కొట్టామని.. ఈసారి 9 కొట్టబోతున్నాం.. మరి మేమంత చెప్పుకోవాలని ప్రశ్నించారు. బీజేపీది పని తక్కువ.. ప్రచారం ఎక్కువ.. అంతా డబ్బు కట్టుకోవడమే అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌ది చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. పనిచేసి ప్రజల హృదయాలు గెలుచుకోవాలని సీఎం కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని తెలిపారు.

**మన దగ్గర కేసీఆర్ అద్భుత ద్వీపం ఉంది :** కంటి వెలుగు పథకం కోటి పరీక్షల మైలు రాయిని అధిగమించిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. గ్యాస్ ధర ఎందుకు పెంచారని నిర్మలా సీతారామన్‌ను మహిళలు నిలదీస్తే సమాధానం చెప్పలేక వెళ్లిపోయారని మంత్రి హరీశ్ రావు తెలిపారు. 40 ఏండ్లు కాంగ్రెస్, 20 ఏండ్లు టీడీపీ అధికారంలో ఉండి ఎందుకు నీళ్లు ఇవ్వలేదని ప్రశ్నించారు.

60 ఏండ్లలో వాళ్లు చేయలేనిది 8 ఏండ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. అల్లావుద్దీన్ ద్వీపం లేదు.. కానీ కేసీఆర్ అనే అద్భుత ద్వీపం మన దగ్గర ఉందని అన్నారు.

**50 పనిదినాల్లో కోటి మార్క్ సాధించడం గొప్ప విషయం :** సీఎం కేసీఆర్ ప్రారంభించిన కంటి వెలుగు కోటి మందికి చేరువైందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 50 పనిదినాల్లో ఇంతమందికి చేరడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంపై సీఎం కేసీఆర్ రోజువారీ సమీక్ష చేస్తున్నారని తెలిపారు. కోటి మార్క్ చేరడంలో కృషి చేసిన వైద్య సిబ్బందికి, వారికి సహకరిస్తున్న మున్సిపల్, పంచాయతీ శాఖలు, జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులకు అభినందనలు తెలిపారు. దృష్టి లోపాలు ఉన్నప్పటికీ చాలామంది చిన్న సమస్యే కదా అని వదిలేస్తుంటారు. కానీ కాలం గడుస్తున్నా కొద్దీ అదే పెద్ద సమస్యకు దారి తీస్తుంది. దీనికి పరిష్కారంగానే సీఎం కేసీఆర్ కంటి వెలుగు అనే మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నివారింపదగ్గ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యం నినాదంతో జనవరి 18న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతున్నది. అని మంత్రి హరీశ్ రావు తెలిపారు.

**మాకు కులం, మతం, తారతమ్యం లేదు :** అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రభుత్వాన్ని నడిపిస్తూ దేశానికి దిక్సూచి చేశారు. అక్కడితో ఆగకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని తలచి, ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మాకు కులం లేదు, మతం లేదు, జాతి లేదు, ఎలాంటి తారతమ్యం లేదు. మానవత్వం, మనిషితనం ఒక్కటే మాకు కనిపిస్తుంది. అందుకే కంటి వెలుగు పరీక్షలు చేసుకుంటున్న వారిలో రామ్ ఉన్నడు, రహీమ్ ఉన్నడు, రాబర్ట్ ఉన్నడు. ఎస్సీ ఉన్నడు, ఎస్టీ ఉన్నడు, ఓసీ ఉన్నడు.. స్త్రీలు ఉన్నరు, పురుషులు ఉన్నరు, ట్రాన్స్ జెండర్లు ఉన్నరు. కోటి మందిలో సుమారు 30 లక్షల మందికి కంటి పరీక్షకు ఉన్నట్లు గుర్తించి అద్దాలు అందించారు. అంటే వీరంతా ఇప్పటి వరకు కంటి సమస్యలతో బాధపడుతున్నారు.

చిన్న సమస్య కదా అని పట్టించుకోని వారు కొందరైతే, కంటి సమస్య ఇబ్బంది పెడుతున్న ఆసుపత్రికి తీసుకువెళ్లే వారు లేక బాధపడిన వారు కొందరు. కంటి వెలుగు వల్ల వీరందరి సమస్య పరిష్కారం అయ్యింది. పరీక్ష చేయించుకున్న 71 లక్షల మందికి.. మాకు కంటి సమస్య లేదు అని ఒక కాన్ఫిడెన్స్ వచ్చింది. ఇక మీదట మరింత జాగ్రత్త వహించాలనే ఆలోచన వచ్చింది.

**మాది చేతల ప్రభుత్వం :** ‘ నీతి అయోగ్ ర్యాంకింగ్స్‌లో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఎక్కడున్నాయి అని అంటే అట్టడుగున ఉన్నాయి. మళ్లీ వీళ్లు వచ్చి తెలంగాణకు నీతులు చెబుతరు. నీతి అయోగ్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ మూడో స్థానంలో ఉంటే, కాంగ్రెస్ పాలిత రాజస్థాన్ 16వ ర్యాంకులో, ఛత్తీస్‌గడ్ 10వ స్థానంలో, హిమాచల్ ప్రదేశ్ 7వ స్థానంలో ఉంది. కేంద్ర మంత్రి మహేంద్ర నాథ్ .. ఉత్తర్ ప్రదేశ్ ర్యాంకు ఎంత అంటే అట్టడుగు స్థానం. చిట్ట చివరి స్థానం. 30వ స్థానంలో ఉన్నోడు వచ్చి మూడో స్థానం వాడికి చెబుతడట. చెప్పుకుంటే సిగ్గు చేటు.. ఉత్తరప్రదేశ్‌లో అసలు ప్రభుత్వ పరిధిలో ఒక్క బీఎస్సీ నర్సింగ్ కాలేజీ కూడా లేదు. కానీ తెలంగాణలో మొత్తం 9 నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేసుకొని, 680 సీట్లు అందుబాటులోకి తెచ్చి, మన ఆడబిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.

మాది చేతల ప్రభుత్వం, చేసేది చెబుతం. 40 ఏళ్లు కాంగ్రెస్, 20 ఏళ్లు తెలుగు దేశం వాళు ఉండే ఎందుకు నీళ్లు ఇవ్వలేదు. వాళ్లు 60 ఏళ్లలో చేయనిది కేసీఆర్ 8 ఏళ్లలో చేశారు. మేనిఫెస్టో లో చెప్పనివి సైతం కేసీఆర్ అమలు చేసి చూపెట్టారు.’ అని తెలిపారు.

# సంపాదకీయం

## ఇదెక్కడి హిపోక్రసీ?

భావోద్వేగం తప్పు కాదు. కానీ.. బాగున్నప్పుడు అందరూ మనోడే అనుకునే వ్యక్తి.. బాగోలేనప్పుడు.. పెద్దగా గుర్తింపు లేనప్పుడు గుర్తించని వైనాన్ని మర్చిపో కూడదు. ఒక దేశానికి ప్రధానమంత్రిగా అయిన వ్యక్తి.. తన మూలాల్లో భారత్ ఉండటాన్ని అతడెంత వరకు గుర్తుంచుకుంటాడు? అన్నది ప్రధాన ప్రశ్న. బ్రిటన్ ప్రధానమంత్రిగా సునాక్ బరిలో ఉన్నప్పుడు.. తాజాగా ప్రధాని అయినప్పుడు మనోడే.. మనోడే అంటూ సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు.. చివరకు మీడియా సైతం పూనకం వచ్చినట్లుగా ఊగిపోవటం.. కొందరైతే ఒక అడుగు ముందుకు వేసి.. అప్పట్లో మనోళ్లను పాలించిన తెల్లోళ్లను.. ఇప్పుడు మనమే పాలిస్తున్నంత ఫీలింగ్ ను ప్రదర్శించటాన్ని మర్చిపోలేం. ఆంత భారత మూలాలు ఉన్నప్పటికి.. తన దేశానికి ప్రధాని అయిన తర్వాత.. తనను నమ్మిన దేశానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారా? లేక తన మూలాలున్న దేశానికి ప్రయారిటీ ఇస్తారా? అన్న దాని గురించి ఎక్కువ ఆలోచించాల్సిన అవసరం లేదు. దీనికి సమాధానం చెప్పేందుకు మనమే ఒక ఉదాహరణ. హైదరాబాద్ లో ఉండే లక్షలాది మంది నేపథ్యం.. ఊరే అవుతుంది. ఊరిని వదిలేసి.. మహానగరానికి రావటం.. ఇక్కడే స్థిరపడిపోవటం.. కెరీర్ లో దూసుకెళ్లేందుకు తెగ కష్టపడటం తెలిసిందే. ఏదైనా సాధించినంతనే మన ఊరోడే అంటూ చంకలు కొట్టేసుకునే దానికి.. తాజాగా జరుగుతున్న దానికి పెద్ద తేడా అయితే లేదన్న విషయాన్ని మర్చిపోకూడదు. తన స్థాయిని ఊరోళ్లు గుర్తించినప్పుడు మనకు కలిగే ఆనందానికి కంటే కూడా తక్కువగానే సునాక్ కు కలిగి ఉంటుంది. ఎందుకంటే.. ఇవాళ్టి రోజున భారతీయులంతా మనోడే అనుకుంటూ కొత్త బంధాన్ని కలుపుకోవటానికి ముందు అతనికి ఎదురైన సవాళ్ల వేళ.. భారత్ కానీ.. భారతీయులు కానీ ఎవరూ నిలబడలేదన్న నిజాన్ని ఒప్పుకోవాలి. అలాంటప్పుడు తన తాతల కాలం నాటి జాతీయత గురించి.. వారి దేశం గురించి అంతగా గుర్తు పెట్టుకుంటారని అనుకోలేం. అలా అయితే.. ఆయన చేపట్టిన పదవికి ఆయన తప్పు చేసినట్లే. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రస్తావన తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైనట్లే. తాను ప్రేమించిన వ్యక్తిని పెళ్లాడి.. భారత్ కు ఆమె వచ్చే నాటికి ఆమె అత్తగారు దేశ ప్రధానిగా తిరుగులేని స్థానంతో పాటు.. ఆమె కుటుంబానికి దేశ ప్రజల్లో ఉన్న గుర్తింపు అంతా ఇంతా కాదు. అలాంటి ఆమె గతంలో ఏం చేశారన్నది పక్కన పెడితే.. భారతీయతకు నిలువెత్తు రూపంగా నిలవటమేకాదు.. తన భర్త.. ఆయన కుటుంబ ధర్మాన్ని ఆమె పాటిస్తూనే వచ్చారు. మరి.. అలాంటి సోనియాకు భారత ప్రధాని పదవిని చేపట్టే అవకాశం వచ్చినప్పుడు మనం ఎలా వ్యవహరించాం? అప్పుడు సోనియాను వేరుగా చూశాం. అంత మాత్రానికే ఆమె తాను పుట్టిన ఇటలీని తన తొలి ప్రాధాన్యతగా భావిస్తూ ఎప్పుడైనా నిర్ణయం తీసుకున్నారా? అంతదాకా ఎందుకు.. మన్మోహన్ ప్రభుత్వానికి తాను రిమోట్ అయిన పదేళ్ల కాలంలోనూ.. ఇటలీకి ఆమె పెద్దపీట వేయటం.. ఆ దేశంతో సన్నిహిత సంబంధాల్ని మెయింటైన్ చేశారా? అంటే లేదనే మాటే వస్తుంది. ఇప్పుడు సునాక్ విషయం లోనూ అదే జరుగుతుంది. ఆ మాటకు వస్తే.. భారత్ విషయంలో ఆయన మిగిలిన వారి కంటే మరింత కచ్చితంగా ఉండొచ్చు. ఎందుకంటే.. తన మూలాల మీద ఎవరోఒకరు ఏదో ఒక వ్యాఖ్య చేస్తారు కాబట్టి.. ఆ అవకాశాన్ని ఇవ్వకుండా జాగ్రత్త పడాలన్న విషయం ఆయనకు తెలుసు. ఆ మాటకు వస్తే.. సునాక్ కారణంగా భారత్ కు మేలు కంటే కూడా అంతో ఇంతో నష్టమే జరుగుతుంది. దీనికి కారణం.. భారత్ విషయంలో ఏ మాత్రం సానుకూలంగా వ్యవహరించినా.. అది ఆయన వ్యక్తిత్వాన్ని వేలెత్తి చూపించేలా చేయటమే కాదు.. నమ్మి అత్యున్నత పదవిలో కూర్చోబెట్టిన దేశానికి.. దేశ ప్రజలకు ధోకా ఇచ్చినట్లు అవుతుంది. అందుకే.. మిగిలిన బ్రిటన్ ప్రధానమంత్రుల కంటే కూడా ఆయన కాలంలో భారత్ కు మేలు జరిగే అవకాశాలు చాలా తక్కువగా ఉండొచ్చు. అంటే.. మనోడు.. మనల్ని వందల ఏళ్లు పాలించిన దేశానికి ప్రధానమంత్రి అయ్యారన్న తుత్తి మనకే తప్పించి.. అతగాడికి ఏమీ ఉండదన్న నిజాన్ని గుర్తించాల్సిందే. భావోద్వేగం తప్పు కాకపోవచ్చు. కానీ.. భావోద్వేగపు బంధంలో సునాక్ ను చూడటం తప్పే అవుతుంది. ఎందుకంటే.. ఆశించిందేదీ జరగదు కాబట్టి.

# నిరీక్షణకు మోక్షమెప్పుడో ?

మంచిర్యాల : జిల్లాలోని ఖానాపూర్, కడెం మండలాల రైతులకు వరప్రదాయిని అయిన సదర్‌మాట్ ప్రత్యేక కాలువ నిర్మాణానికి ఇంకా నిరీక్షణ తప్పేలా లేదు. ఏళ్లు గడుస్తున్నా.. పనులు మాత్రం జరిగేలా కనిపించడం లేదు. 2017లో ముఖ్యమంత్రి కేసీఆర్ సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణానికి రూ. 516కోట్లు మంజూరు చేశారు. అయితే బ్యారేజీ ఉన్న ఖానాపూర్ శివారులోని సదర్‌మాట్ ఆనకట్ట వద్ద కాకుండా దానికి ఏడు కిలోమీటర్ల ఎగువన ఉన్న నిర్మల్ నియోజకవర్గంలోని మామడ మండలం పొన్కల్ వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. దీంతో ఖానాపూర్ నియోజకవర్గ రైతులు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేశారు. ఇలా చేయడం వల్ల బ్యారేజీ నుంచి సాగునీరు తమకు రాకుండా నేరుగా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జగిత్యాల జిల్లాకు వెళుతుందని మండిపడ్డారు. ఇలా అయితే తమకు నీరురాక పంటలు పూర్తిస్థాయిలో ఎండుతాయని సంవత్సరం పాటు ఆందోళనలతో హోరెత్తించారు. దీంతో దిగొచ్చిన రాష్ట్రప్రభుత్వం పొన్కల్ బ్యారేజీ నుంచి సదర్‌మాట్ ఆనకట్ట వరకు ఏడు కిలోమీటర్ల మేర ప్రత్యేక కాల్వ నిర్మాణం చేపట్టి.. రైతులకు మొదటి ప్రాధాన్యతగా సాగు నీరందిస్తామని ప్రకటించింది. కానీ ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ ప్రత్యేక కాల్వ ప నులు ప్రారంభం కాలేదు. దీంతో ఈ ప్రాంత రైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్రతిపక్ష పార్టీలతో కలిసి మరోమారు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఇదీ సదర్‌మాట్ ఆనకట్ట చరిత్రఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అధికంగా వరిని పండించే ప్రాంతాల్లో ఒకటిగా గతంలో ఖానాపూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడ పండించిన వరిపంటకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉండేది. ఆ కాలంలోనే అందరికీ భోజనాన్ని అందించిన ప్రాంతం కాబట్టే.. 'ఖానా'పూర్‌ను ఆ పేరుతో పిలిచే వారని ప్రతీతి. ఇక్కడి రైతులకు ఇంతటి గుర్తింపును తెచ్చి న సదర్‌మాట్ ఆనకట్ట ఈ ప్రాంతానికి జీవనాధారం. ఈ సదర్‌మాట్ ఆనకట్టను ఖానాపూర్ మండలం మేడంపెల్లి అడవుల్లో గోదావరి నదికి అడ్డంగా అప్పటి నిజాం నవాబుకాలంలో 1891-92 సంవత్సరంలో ఫ్రెంచ్ ఇంజినీర్ జేజే వోటాలే నిర్మించారు. ఈ ఆనకట్ట ద్వారా ఖానాపూర్, కడెం ప్రాంతాల్లో సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతోంది. ఈనేపథ్యంలో సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని గత 60 ఏళ్లుగా ఈ ప్రాంత రైతు లు డిమాండ్ చేస్తూ వచ్చారు. అయితే 2006లో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇక్కడి రైతుల కోరిక మేరకు సదర్‌మాట్ బ్యారే జీ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత వైఎస్ మరణించడంతో సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం మరుగున పడిపోయింది. ఫ రైతుల ఆనందం.. అంతలోనే ఆవిరి! ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన తర్వాత సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం ఏర్పాటు చేయాలంటూ ఆందోళనలు జోరందుకున్నాయి. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ 2017లో సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణానికి రూ.516 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కానీ ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం చారిత్రక కట్టడమైన సదర్‌మాట్ ఆనకట్ట వద్ద కాకుండా ఏడు కిలోమీటర్ల ఎగువన నిర్మల్ నియోజకవర్గంలోని మామడ మండలంలోని పొన్కల్ వద్ద చేపడుతున్నట్టు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ ప్రాంతంలో 2017 నుండి సంవత్సరం పాటు రైతులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేపట్టారు.ఫ ఏడు కిలోమీటర్ల కాల్వ నిర్మాణంపై మాట తప్పిన సీఎం.. మళ్లీ రైతుల ఆందోళన బాట సదర్‌మాట్ ఆనకట్ట వద్దే బ్యారేజీ నిర్మాణం కూడా చేపట్టాలని రైతులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఖానాపూర్ నియోజకవర్గంలో 207, 2018 సంవత్సరాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. అయితే 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా నవంబర్ 22వ తేదీన ఖానాపూర్‌కు వచ్చిన సీఎం ఈ విషయమై స్పందించారు. సదర్‌మాట్ నీటిపై ఈ ప్రాంత రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని సూచించారు. ప్రస్తుతం పొన్కల్ వద్ద నిర్మాణమవుతున్న సదర్‌మాట్ బ్యారేజీ నుంచి సదర్‌మాట్ ఆనకట్ట వరకు ఏడు కిలోమీటర్ల మేర ప్రత్యేకకాలువ నిర్మించి.. సుమారు 30 వేల పాత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన ఖానాపూర్, కడెం ప్రాంతాల రైతులు.. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ తర్వాత గత మూడేళ్లుగా ఎలాంటి ఆందోళనలు చేయలేదు. కేసీఆర్ మాటపైనే నమ్మకం పెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకు కేసీఆర్ మళ్లీ ప్రత్యేకకాలువ ప్రస్థావన తేకపోవడం.. కాలువ పనులు మొదలు కాకపోవడం.. మరోవైపు సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం చివరిదశకు చేరుకోవడం తో.. ఈ ప్రాంత రైతులు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో మరోమారు ఈ ప్రాంత రైతులు, ప్రతిపక్షాలు సదర్‌మాట్ ప్రత్యేకకాల్వపై ఉద్యమించేందుకు సన్నద్ధమవుతున్నారు. టీఆర్ఎస్ నాయకులను నిలదీసి.. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే దిశగా సమాయత్తమవుతున్నారు. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి మూడేళ్లు దాటిపోవడం మరోవైపు సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం చివరిదశకు చేరుకోవడంతో రైతులు, ప్రతిపక్షాలు ఉద్యమించేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఉద్యమానికి సన్నద్ధం చేసేందుకు ఈ నెల 13న ఖానాపూర్‌లో సదర్‌మాట్ రైతాంగంతో ప్రత్యేక సమావేశాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# 'పంచాయతీ'లపై బకాయిల భారం




కరీంనగర్ : పల్లెల్లో సకల సౌకర్యాలు కల్పించి ప్రగతిబాటలో నడిపిస్తూ పట్టణాలకు వలసలు అరికట్టాలని తెలంగాణ ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటుతో పాటు పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు నిర్మించి పల్లెలు పట్టణశోభను సంతరించుకునేలా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. మొదటి, రెండు విడతల పల్లెప్రగతి కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగిపోయినా మూడు, నాలగవ విడతలకు వచ్చే సరికి నిధుల సమస్య ప్రతిబంధకంగా మారింది. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఫ్రీజింగ్ విధించడంతో పనులు చేపట్టిన సర్పంచులకు, కాంట్రాక్టర్లకు బిల్లులు అందక ఆస్తులు అమ్ముకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. పనులు పూర్తిచేసి కొందరు అప్పుల బాధతో అల్లాడుతుంటే నిధులు లేక పెట్టిన డబ్బు చేతిక రాక అర్ధాంతరంగా పనులు నిలిపివేసినవారు మరికొందరున్నారు. పల్లె ప్రగతి పనులు పూర్తిచేయాలంటూ జిల్లా కలెక్టర్ల ఒత్తిడి పెరిగిపోవడంతో సర్పంచులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని, రోడ్డు, డ్రైనేజీలు, పారిశుధ్యం, వీధిదీపాలు కూడా లేక గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు దూరమయ్యాయని అధికారపార్టీ ప్రజాప్రతి నిధులు, పార్టీనేతలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. వారి మాటల్లో నిజమున్నా పనులు చేపట్టి పూర్తిచేసిన వారికి బిల్లులు అందడం లేదన్నదని అంతే నిజమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ముందుకు సాగని అభివృద్ధి పనులు

పల్లెప్రగతి మొదటి, రెండు విడతల్లో చేపట్టిన పనులకు నిధులు సకాలంలో మంజూరీ చేయడంతో ప్రభుత్వం చెప్పినట్టుగానే పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెట్టింది. అయితే ఆ తర్వాత మూడు విడత, నాల్గవ విడత పల్లె ప్రగతి కార్యక్రమాలకు నిధులు విడుదల చేసినప్పటికీ ఆ కార్యక్రమంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వడం లేదని సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. పల్లెప్రగతి నిధులతోపాటు గ్రామీణ ఉపాధి హామీ పథకం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా గ్రామపంచాయతీలకు ఇస్తున్న గ్రాంట్ల ద్వారా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. జిల్లాలో 313 గ్రామపంచాయతీల్లో పల్లెప్రగతి కార్యక్రమంలో 314 వైకుంఠదామాల నిర్మాణాలకు 3,713.83 లక్షలను మంజూరు చేయగా కేవలం నాలుగు వైకుంఠదామాలు మాత్రమే పూర్తికాగా, 149 ప్రగతిలో ఉన్నాయి. 313 సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలకు 770.70 కోట్లు మంజూరు చేయగా నాలుగు పనులు ప్రగతిలో ఉండగా ఒక్కటి కూడా ఇంకా పూర్తికాలేదు. 72,516 ఇంకుడుగుంతలను నిర్మించేందుకు ప్రభుత్వం 3,291.77 లక్షలను మంజూరీ చేసినప్పటికి 6,273 ప్రగతిలో ఉండగా 285 మాత్రమే పూర్తయ్యాయి. 2,107.39 లక్షలతో 2,652 వ్యవసాయ కల్లాలను నిర్మించాల్సి ఉండగా 55 పూర్తికాగా, 643 ప్రగతిలో ఉన్నవి. 50 పాఠశాలల్లో మూత్రశాలల నిర్మాణ పనులకు ప్రభుత్వం 102.80 లక్షలను మంజూరు చేయగా ఒక్కటి కూడా ఇంకా పూర్తి కాలేదు. కేవలం తొమ్మిది పనులు మాత్రం ప్రగతిలో ఉన్నవి. నిధుల లేమి, బిల్లుల చెల్లింపులపై అనధికారిక ఫ్రీజింగ్, ఇతరత్రా కారణంగా అభివృద్ధి పనులు ఆశించిన మేరకు జరుగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా గ్రామపంచాయతీలకు 14, 15వ ఆర్థిక సంఘం, ఇతరత్రా గ్రాంట్లు ద్వారా విడుదల చేస్తున్న నిధులు గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ట్రాక్టర్లు, ఆటో ట్రాలీల నిర్వహణ వంటి ఖర్చులకే సరిపోవడం లేదని చెబుతున్నారు.

ఆదాయమంతా ప్రభుత్వ ఖజానాకే...

ప్రజల నుండి వసూలు చేస్తున్న ఆస్తిపన్నులు, ఇంటి నిర్మాణ అనుమతులకు సంబంధించిన పన్నులను, ఇతరత్రా పనులన్నిటినీ ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఖజానాలోనే జమ చేయడంతో నిధుల కొరత ఏర్పడుతోందని అంటున్నారు. అనేక గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో గతంలో ఏర్పాటు చేసిన నర్సరీలు, ట్రీగార్డులు, వాహనాల మరమ్మతులు, ఇతరత్రా అభివృద్ధి పనులకు సంబం ధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చిన్న గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు రెండు లక్షల నుంచి ఆపై పెండింగ్‌లో ఉండగా మేజర్ గ్రామపంచాయతీల్లో ఐదు లక్షలు, ఆపై కూడా బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని, దాదాపు ఏడాది నుంచి మొత్తం గ్రామపంచాయతీలకు 150 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించాల్సి ఉన్నాయని సర్పంచులు చెబుతున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, రాష్ట్రస్థాయిలోని ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా బిల్లులు ఇవ్వడం లేదని, ఒకవేళ బిల్లులకు సంబంధించిన చెక్కులను ఇచ్చినా వాటిని బ్యాంకుల్లో జమ చేస్తే రెండు, మూడు నెలలు కూడా డబ్బులు జమ కావడం లేదని, కొన్ని సందర్భాల్లో ట్రెజరీలో ఎంతో కొంత ముట్టజెబితే కానీ డబ్బులు జమ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నవి. గ్రామపంచాయతీ పరిధిలోని గ్రానైట్, ఇసుక క్వారీలు, ఇతరత్రా సహజవనరుల ద్వారా వచ్చే ఆదాయంలో నుంచి గ్రామపంచాయతీలకు ఇచ్చే సీనరేజీ నిధులను కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదని, పంచాయతీలకు ప్రధాన ఆర్థికవనరులైన సీనరేజీ నిధులను ఇవ్వకుండా ప్రభుత్వం మంగళంపాడిందని, దీనితో గ్రామపంచాయితీలో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు. ఇక పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పవర్ వీక్‌లో చాలా గ్రామాల్లో ఇంకా విద్యుత్ సమస్యలను పరిష్కరించలేదని, ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో ఆమేరకు పనులు జరుగడం లేదని పలువురు సర్పంచులు చెబుతున్నారు.

సీనరేజీ నిధులు.. పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి

ఉప్పుల అంజనీప్రసాద్, సర్పంచుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడుగ్రామపంచాయతీలకు ప్రధాన ఆర్థిక వనరులైన సీనరేజీ నిధులను ఏడాదిన్నర నుంచి ఇవ్వడం లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 100 కోట్లకు పైగా పంచాయతీలకు సీనరేజీ నిధులు ఇవ్వాల్సి ఉంది. సీనరేజీ నిధులు ఇవ్వాలని తాము ప్రభుత్వాన్ని కోరుతుంటే ఆ నిధులు ఇవ్వక పోగా పల్లెప్రగతిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను కూడా చెల్లించడం లేదు. ట్రెజరీల్లో బిల్లుల కోసం చేతులు తడపాల్సిన దుస్థితి నెలకొంది. పవర్‌వీక్‌లో అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటిని పరిష్కరించడం లేదు.

# ఇక నేరుగా నమోదు..!

మంచిర్యాల : ఆరోగ్య కార్యక్రమాలతో తీరికలేకుండా పనిభారంతో సతమతమవుతున్న ఆశాలకు కాస్త ఉపశమనం లభించింది. సంక్రమిత, అసంక్రమిత, క్షయ తదితర అనేక వ్యాధులకు సంబంధించి ఎప్పటికప్పుడు కొంత కష్టమైనా రాతపూర్వకంగా వివరాలు సేకరించి పక్కా సమాచారాన్ని ఆరోగ్యశాఖకు అందిస్తున్న వీరిని ప్రభుత్వం ఊపిరి పీల్చుకునేలా చేసింది. పనులను కొంత సులువుగా, ఎక్కడికక్కడే చేసే విధంగా ఏర్పాట్లు చేసింది. ఒకసారి పుస్తకాల్లో, మరోసారి ఆన్‌లైన్లో.. ఇలా రెండు, మూడు సార్లు నమోదుకు సమయాన్ని వృథా చేయకుండా అందించే సేవల్లో పారదర్శకత లక్ష్యంగా చరవాణులు అందించింది. జిల్లా వ్యాప్తంగా వేలసంఖ్యలో ఉన్న ఆశా కార్యకర్తలకు పంపిణీ చేయగా ఆయా సిబ్బంది పని ప్రారంభించారు.

అన్ని కార్యక్రమాలు వీరితోనే మొదలు..

ఆరోగ్య కార్యక్రమం ఏదైనా విజయవంతం కావాలంటే ఆశా వర్కర్ల(సామాజిక ఆరోగ్య కార్యకర్త) భాగస్వామం తప్పనిసరి. పట్టణాలు, గ్రామాల్లో వీరి సేవలు కీలకం. జ్వరం, టీబీ సర్వే మొదలు గర్భిణులు,



బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటూ అవసరమైన వారికి చికిత్స అందించే బాధ్యత తీసుకుంటారు. టీకాలు వేయించడంలో వీరిది కీలకపాత్ర.

పనులు సులువు.. సమయం ఆదా..

ఆరోగ్య సర్వేలు చేసేందుకు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి వివరాలు ఆయా కార్యక్రమాలకు సంబంధించిన పత్రాల్లో నమోదు చేసుకునేవారు. ఆ తర్వాత తమ పరిధిలోని పీహెచ్‌సీలకు వెళ్లి సేకరించిన సమాచారాన్ని కంప్యూటర్‌లో పొందుపరిచేవారు. ఇలా చేయడంవల్ల గంటలకొద్ది సమయం పట్టేది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసి ఆశా కార్యకర్తలందరికి స్మార్ట్ ఫోన్‌లు అందజేసింది. ఇక నుంచి ప్రజల నుంచి సేకరించిన వివరాలు నేరుగా సంబంధిత యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఇకపై కొవిడ్ పరీక్షలు, టీకాల వివరాలు సైతం రాయాల్సిన అవసరం ఉండదు. పనులు సులువు కావడంతో పాటు వారికి సమయం కూడా ఆదా అవుతుంది. ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులో ఉండటంతో నమోదు ఎలాంటి అంతరాయం ఉండదు.

ఎలాంటి తప్పులుండవు డా. కుమురం బాలు, జిల్లా వైద్యాధికారి

ఒకసారి రాతపూర్వకంగా మరోసారి ఆన్‌లైన్లో నమోదుతో ఇబ్బందితో పాటు తప్పులు దొర్లే అవకాశముంటుంది. ప్రస్తుతం వారికిచ్చిన చరవాణులతో బాధితుల వద్దే వివరాలన్ని సేకరించి వారిముందే నమోదు చేస్తుండటంతో ఎలాంటి తప్పిదాలు జరగవు. సర్వేల వివరాలు, వాటి నివేదికలను ఎప్పటికప్పుడు వైద్యాధికారులకు అందించేందుకు ఈ చరవాణులు ఉపయోగపడతాయి.

# ఆరుతడి పంటలకూ నీటి తంటాలు

భద్రాచలం :సాగునీటి వారబందీలో చిక్కుకుని రైతులు విలవిల్లాడుతున్నారు. సమయానికి తడులు అందక పంటలు ఎండిపోతుండటంతో కంటిమీద కునుకు ఉండటం లేదు. ప్రభుత్వం యాసంగిలో వరి వద్దని చెప్పడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గారు. ఎన్నో ఆశలతో సాగు చేసిన ఆరుతడి పంటలు ఎండిపోతుండటంతో నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు.

పది రోజుల విరామం

ప్రభుత్వ సూచన మేరకు జిల్లాలోని సాగర్ ఆయకట్టు పరిధిలో అత్యధిక విస్తీర్ణంలో మొక్కజొన్న, పెసర, శనగ వేశారు. గతంతో పోలిస్తే వరి విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. సాగర్ పరిధిలోని కాల్వలకు వారబందీ విధానంలో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పద్ధతిలో వారంపాటు నీటిని సరఫరా చేస్తే, మరోవారం నిలిపివేస్తారు. ఈ వ్యవధి పది రోజుల వరకు పొడిగిస్తుండటంతో కింది భాగంలో పొలాలకు నీటి



తడులు ఆలస్యమవుతున్నాయి. చివరి భూముల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లాలో సాగర్ పరిధిలో 17 మండలాలుండగా వీటికి నీటిని అందిస్తూనే కృష్ణా జిల్లాకు సరఫరా చేయాలి.

దిగుబడులపై ప్రభావం

మొక్కజొన్నకు వారానికో తడి అవసరం. పెసర, శనగ, ఇతర ఆరుతడి పంటలకు సైతం పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో తడులు అధికం కావాలి. సక్రమంగా అందిస్తేనే దిగుబడులు వస్తాయి. మొక్కజొన్నకు నీరందకుంటే ఎకరానికి అయిదు క్వింటాళ్ల దిగుబడి తగ్గే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పత్తి, మిరప సాగులో తీవ్రంగా నష్టపోయారు. కనీసం యాసంగి పంటలతోనైనా ఉపశమనం కలుగుతుందని భావించినా నీటి ఇబ్బందులు అశనిపాతంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేక ఈ దుస్థితి ఎదురవుతోంది. బోనకల్లు బ్రాంచి కాలువ పరిధిలో కొణిజర్ల, చింతకాని, వైరా, బోనకల్లు మండలాలు ఉండగా అత్యధికంగా మొక్కజొన్న సాగుచేశారు.

లి రాపల్లె మేజర్ పరిధిలోని సోమవరం మైనర్ చివరి ఆయకట్టు మొక్కజొన్న పంట ఎండిపోతుందని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టింపు లేదు.


లి తుమ్మలపల్లి పరిధిలోని రైతులు ఇటీవల వైరా ఎమ్మెల్యేను కలిసి నీటి ఇబ్బందులు వివరించారు.

లి బోనకల్లు, చింతకాని మండలాల్లో సైతం ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆందోళనకు దిగుతున్నారు.

లి ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, మధిర ఇతర మండలాల్లోనూ సాగునీటి కష్టాలు తప్పటం లేదు.

# సౌర విద్యుత్తు కేంద్రాలు.. హుళక్కేనా?

గద్వాల : రైతులకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను నిర్మించి, నీటిని ఆయకట్టుకు తరలిస్తోంది. నీటిని తోడి పోసేందుకు ప్రభుత్వంపై ఏటా రూ.వందల కోట్లు విద్యుత్తు బిల్లుల భారం పడుతోంది. నెట్టెంపాడు పథకంలో కనీసం 12 టీఎంసీల నీటిని తోడి పోయాలంటే రూ.45 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు విద్యుత్తు బిల్లు వస్తోంది. ఒక్కో టీఎంసీకి కనీసం రూ.4.5 కోట్ల వరకు ఖర్చు అవుతోంది.
ఏటా 90 నుంచి 120 రోజులు మాత్రమే నీటి ఎత్తిపోత ఉంటుంది. మిగతా రోజుల్లో ప్రాజెక్టుల వద్ద లైటింగ్ ఇతర అవసరాల కోసం విద్యుత్తు వినియోగం తప్పనిసరి అవుతోంది. పెరిగిన ఛార్జీల కారణంగా నెలకు రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు బిల్లు వస్తోందని సాగునీటి శాఖ అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. సాధారణ సమయంలో వచ్చే విద్యుత్తు బిల్లుల భారం తగ్గించేందుకు సౌర విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యుత్తు వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం మూడేళ్ల కిందట ప్రతిపాదించింది. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.ఏటా తగ్గే భారం రూ.20 కోట్లు.. : ఎత్తిపోతల పథకాల్లో నీటిని తోడివేసే సమయంలో కాకుండా సాధారణ సమయాల్లో విద్యుత్తు వినియోగం కోసం సౌర విద్యుత్తు కేంద్రాలు చక్కగా పని చేస్తాయి. ఒక మెగావాట్ కేంద్రం నుంచి 5 యూనిట్ల వరకు ఉత్పత్తి రోజు వస్తుంది. ఉమ్మడి జిల్లాలో 8 పంపింగ్ కేంద్రాల వద్ద వీటిని నిర్మిస్తే.. ఏటా రూ.16 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వంపై బిల్లు



భారం తగ్గనుంది. ఒక మెగావాట్ సౌర విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి రూ.5.50 కోట్లు ఖర్చు కానుంది. 8 చోట్ల నిర్మాణానికి రూ.40 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఒక సారి పనులు చేపడితే 30 ఏళ్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ కేంద్రాలను ఏర్పాటు చేసి సాధారణ సమయాల్లో పంపింగ్ కేంద్రాల్లో అవసరాలకు వినియోగిస్తే 30 ఏళ్ల వ్యవధిలో రూ.600 కోట్ల వరకు భారం తగ్గే అవకాశం ఉంటుంది.

మెగావాట్ యూనిట్ ప్రతిపాదన

ఉమ్మడి జిల్లాలో నెట్టెంపాడు, కోయిలసాగర్, కల్వకుర్తి, భీమా ఎత్తిపోతల ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో పంపింగ్ కేంద్రాల నిర్మాణం కోసం ఒక్కో పంపింగ్ కేంద్రం వద్ద 150 నుంచి 200 ఎకరాల వరకు భూములను అప్పట్లో సేకరించారు. ఒక్కో కేంద్రం వద్ద నిర్మాణ అవసరాలు పోనూ 50 నుంచి 80 ఎకరాల వరకు మిగులు భూములున్నాయి. వాటి పరిధిలో ఒక్కో పంపింగ్ కేంద్రం వద్ద ఒక మెగావాట్ సౌర విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి 5 నుంచి 7 ఎకరాల వరకు భూమి అవసరం కానుందని అప్పట్లో గుర్తించి ప్రభుత్వానికి సాగునీటి శాఖ ప్రతిపాదనలు పంపించింది.

ప్రతిపాదనలు పంపించాం

గతంలో ప్రభుత్వ సూచన మేరకు ప్రతిపాదనలు పంపించాం. పంపింగ్ కేంద్రాల వద్ద మిగులు భూముల వివరాలు అందజేశాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సాధారణ సమయంలో ఎత్తిపోతల పథకాల పరిధిలో సౌర విద్యుత్తు వినియోగం వల్ల రూ.కోట్లలో విద్యుత్తు బిల్లు ఆదా అయ్యే అవకాశం ఉంటుంది.శ్రీనివాసరావు, ఎస్‌ఈ, జోగులాంబ జిల్లా ప్రాజెక్టులు

# అర్హులు సిద్ధం.. అసంపూర్తితో ఆటంకం

హుస్నాబాద్: గూడు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయానికి అమలులో జాప్యం జరుగుతోంది. హుస్నాబాద్ పురపాలికలో అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తయినా నిర్మాణాలు పూర్తి కాలేదు. ఎప్పుడు గృహ ప్రవేశం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. హుస్నాబాద్‌లో మొదటి దఫాగా 160, రెండో దఫాగా 400 ఇళ్లు మంజూరయ్యాయి. సంవత్సరంలో మంజూరైన ఇళ్లకు సంబంధించి స్థానిక నాగారం రోడ్‌లో స్థలాన్ని సేకరించి నిర్మాణాన్ని ప్రారంభించారు. మొదటి దశలోనివి మూడేళ్ల క్రితమే పూర్తి చేశారు. మిగతావి ప్రారంభించినా కుంటినడకన సాగుతున్నాయి. రెండు పడక గదుల లబ్ధిదారుల ఎంపికకు ఆరు నెలలుగా కసరత్తు జరిగినా రెండు నెలల క్రితం పూర్తి చేశారు. జిల్లా అధికారులతో రెండు దఫాలుగా సర్వే నిర్వహించారు. ఎంపిక చేసిన 342 మంది అర్హులలో లాటరీ పద్ధతిన 264 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. దాదాపు 270 ఇళ్లకు సంబంధించి పట్టాల పంపిణీకి సిద్ధమయ్యారు. గత నెలలో మంత్రి కేటీఆర్ పర్యటించి కేటాయింపు పత్రాలు



ఇచ్చేందుకు ప్రణాళిక చేశారు. మంత్రి పర్యటన వాయిదా పడింది. ఇళ్లలో 160 పూర్తయ్యాయి. మిగిలిన వందకు పైగా మౌలిక వసతుల కల్పన జరుగలేదు. నీటి సదుపాయం లేదు. మిషన్ భగీరథ రిజర్వాయరు నిర్మాణం ప్రస్తుతం కొనసాగుతోంది. ప్లాస్టరింగు, ఫ్లోరింగ్, ప్లంబింగ్ కాలేదు. కిటికీలు, తలుపులు, విద్యుత్తు తీగలు బిగించలేదు. పెయింటింగ్ పనులు బయటి గోడలకు పూర్తయింది. శౌచాలయాల పనులు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు ఎంపిక చేసిన గృహాలకు ఇప్పటికే సంఖ్య కేటాయింపు పూర్తయింది. భారీ కార్యక్రమం నిర్వహించి మంత్రి చేతుల మీదుగా పత్రాలు అందించి గృహ ప్రవేశాలు చేయించాలని అధికారులు భావిస్తున్నారు. పనులన్నీ పూర్తవడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయమై ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న ఏఈ సాజిద్‌ను విచారించగా నెల రోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రహదారుల నిర్మాణాలు, పనులు అయ్యాయని చెప్పారు.

# కల్లంలో ధాన్యం.. కళ్లల్లో దైన్యం



నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ధాన్యం కొనుగోళ్లకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆయకట్టులోని త్రిపురారం, మిర్యాలగూడ, వేములపల్లితో పాటూ నల్గొండ, కనగల్, దేవరకొండ, సూర్యాపేట, జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో కోతలు పూర్తై రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఈ నెల 15 నుంచి కేంద్రాలను ప్రారంభిస్తామని వెల్లడించడంతో.. ప్రస్తుతమున్న వాతావరణ పరిస్థితులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవలే కురిసిన వడగండ్ల వానకు ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరగ్గా...తాజాగా సోమవారం సాయంత్రం సైతం అక్కడక్కడా వడగండ్ల వాన కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఈ యాసంగిలో 13.20 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇది గతేడాదితో పోలిస్తే మూడు లక్షల ఎకరాలు అదనం. ఒక ఉమ్మడి జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున విస్తీర్ణంలో వరి పంట సాగవడం రాష్ట్రంలోనే ప్రథమమని అధికారులు వెల్లడించారు. మొత్తం 33 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో సగం మేర కొనుగోలు కేంద్రాలకు వచ్చినా.. తాము కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఏప్రిల్ నెలలో ప్రకృతి ప్రకోపం

ఏటా ఈ సీజన్‌లో ప్రకృతి ప్రకోపం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి పక్షం రోజుల పాటూ అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు పడటంతో ఉమ్మడి జిల్లాలో ప్రతి యాసంగిలో రైతులకు పంటనష్టం కలుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా సౌకర్యం కల్పించకపోవడంతో వారికి ఆర్థికంగా నష్టం మిగులుతోంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం సైతం యాసంగి సాగును ఒక నెల ముందుకు జరపాలని ప్రాథమికంగా నిర్ణయించింది. డిసెంబరు మొదట్లో వరి నాట్లు ప్రారంభించి, మార్చి చివరి నాటికి కోతలు పూర్తి చేస్తే ప్రకృతి సవాళ్లను తట్టుకోవచ్చని, ఈ కాలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులు ఉండకపోవడంతో పంట నష్టమూ తగ్గుతుందని నిపుణుల అభిప్రాయం.

అయితే ఉమ్మడి జిల్లాలో బోరు, బావుల కింద సుమారు 20 శాతం మంది రైతులు మార్చి చివరి నాటికే కోతలు పూర్తి చేస్తున్నారు. ఏప్రిల్ చివరి నాటికి గానీ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో కోతలు పూర్తి చేసినా వడగండ్లు, అకాల వర్షాల నుంచి తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు మూడు రోజుల నుంచి వాతావరణ మార్పులతో వర్షాలు కురుస్తుండటంతో కోతలు పూర్తయిన రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.

మార్గదర్శకాలపై లేని స్పష్టత

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మూడు జిల్లాల అధికారులకు ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని తెలిసింది. దీంతో మరో వారం రోజుల వరకు కొనుగోలు కేంద్రాల ప్రారంభం లేనట్లేనని సమాచారం. ఈ నెల 10న అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ డీఎంలు, మార్కెటింగ్ అధికారులతో హైదరాబాద్‌లో ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. దీంతో ఆ తర్వాతనే కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఉంటాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే...

ఈ నెల 10న రాష్ట్ర స్థాయి సమావేశం అనంతరం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే.. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ఇప్పటికే నల్గొండ జిల్లాలో కోటిన్నర గన్నీ బ్యాగులను సిద్ధం చేశాం. మార్కెటింగ్ శాఖ సైతం కొనుగోళ్లకు సిద్ధంగా ఉంది. భాస్కర్‌రావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్గొండ

# ఎయిమ్స్‌కు ప్రధాని భూమి పూజ చేస్తారా?



నల్గొండ : బీబీనగర్ ఎయిమ్స్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర పర్యటనలో భాగంగా రూ.11,355 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ రైలు ప్రారంభం, రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు, రూ.7,864 కోట్లతో నిర్మించే ఆరు హైవేలు, రూ.1366 కోట్ల చేపట్టే బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి పనులను ప్రారంభించి పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభలో మోదీ పాల్గొననున్నట్లు సమాచారం. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు సంబంధించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తన ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేశారు. బీబీనగర్ ఎయిమ్స్‌కు గతంలో కేటాయించిన నిధులకు తోడు ఇటీవల మరో రూ.312 కోట్లు కేటాయించిన విషయం విధితమే. ఎయిమ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి కానీ భూమిపూజ కార్యక్రమం ఇప్పటి వరకు జరగలేదు. గత జనవరి నెలలో ప్రధాని తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా వందే భారత్ రైలును ప్రారంభించి బీబీనగర్ భూమిపూజలో పాల్గొంటారని అధికార వర్గాలు చెప్పినా.. అనివార్య కారణాలతో ప్రధాని పర్యటన రద్దయింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వర్చువల్ ద్వారా ప్రారంభించారు కానీ ఎయిమ్స్ భూమిపూజ కార్యక్రమం చేపట్టలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న బీబీనగర్ ఎయిమ్స్‌కు భూమి పూజ చేయనున్నట్లు తెలిసింది. దీనిపై ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియాను వివరణ కోరగా ప్రధాని పర్యటనపై అధికారికంగా స్పష్టత లేదని రెండు నెలల క్రితం పీఎంవో కార్యాలయం నుంచి సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారని తెలిపారు. అధికారికంగా ఖరారైతే సమాచారం అందజేస్తామని తెలిపారు. ఎయిమ్స్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు.నాటేందుకు చదును చేస్తున్నారు.

# రుణం.. ప్రగతికి సోపానం

మెదక్: నిర్దేశించిన లక్ష్యం మేరకు గత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు రుణ లక్ష్యాలను పూర్తి చేసింది. అధికారులు ప్రణాళికతో ముందుకు సాగడంతో ఇది సాధ్యమైంది. తీసుకున్న వాటిని తిరిగి చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సంఘాలకు బ్యాంకర్లు పూచీకత్తు లేకుండానే సహకారం అందజేస్తున్నాయి. దీంతో చాలా సంఘాలు రుణాలను పొంది వాటిని వ్యాపారం నిర్వహణ, కుటుంబ అవసరాలకు వినియోగించుకుం టున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వ్యాపార రంగంలో ప్రవేశించేందుకు ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసింది. ఒక్కో సంఘంలో కనీసం పది మంది సభ్యులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీటికి ఏటా సెర్ప్ రుణాలను అందజేస్తోంది. చాలా మంది మహిళలు స్వయం ఉపాధి వైపు మొగ్గుచూపుతూ, నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని ఆదాయం పొందుతున్నారు. నెలనెలా తిరిగి బ్యాంకుకు డబ్బులు చెల్లిస్తుండడంతో బ్యాంకర్లు కూడా సహకరిస్తున్నారు.రూ.587.77 కోట్లు పంపిణీ జిల్లాలో సెర్ప్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు 2022-23 ఆర్థికసంవత్సరానికి 11,339 సంఘాలకు రూ.584.80 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా, 9,445 సంఘాలకు రూ.587.77 కోట్లు అందించారు. ఆర్థికసంవత్సరం మొదలైన నాటి నుంచి అధికారులు ప్రణాళికతో దీనిపై దృష్టి సారించారు. ప్రతి నెలా మండలాల వారీగా సమావేశాలను నిర్వహిస్తూ పర్యవేక్షించారు. ముందుగా రూ.392 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా, ఆ తర్వాత రూ.584.80 కోట్లకు పెంచారు. ఆర్థికసంవత్సరం ముగింపులోగా లక్ష్యాన్ని పూర్తి చేశారు.



పురపాలికల్లో రూ.43.13 కోట్లుజిల్లాలోని నాలుగు పురపాలికల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)ద్వారా 555 సంఘాలకు రూ.42.73 కోట్లను అందజేయాలని లక్ష్యం విధించగా, గడువులోపు 543 సంఘాలకు రూ.43.13 కోట్లను అందజేశారు. జిల్లా కేంద్రం మెదక్‌లో అత్యధికంగా రూ.16.15 కోట్లు ఇవ్వగా, తూప్రాన్‌లో రూ.11.82 కోట్లు ఇచ్చారు. అత్యల్పంగా నర్సాపూర్ పురపాలికలో నమోదైంది. పట్టణప్రాంతాల్లో సైతం మహిళలు వ్యాపారాల నిర్వహణకు, కుటుంబ అవసరాలకు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా..

జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుంటూ, వ్యాపారాలను విస్తరిస్తున్నారు. కిరాణం, బేకరీ, టైలరింగ్ దుకాణాల నిర్వహణ, గేదేలు, మేకలను కొనుగోలు చేసి కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. వారు తయారు చేసిన వస్తువులను మంజీరా మార్ట్‌ల పేరిట మండలాల వారీగా దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నారు.

# అంతర పంట.. ఆదాయం భళా

ఊట్కూరు : ఏటా రెండు సీజన్లలో కూడా పత్తి, కంది పంటలు సాగుచేస్తూ ఆ రైతు నష్టాలే చవిచూశారు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలం దిగుబడి వస్తుందని ఉద్యాన అధికారులు చెప్పడంతో ఆయిల్ పామ్ సాగు చేశారు. దిగుబడి వచ్చే వరకు ఆలస్యం కానుండటంతో తక్షణ ఆదాయం కోసం అంతర పంటగా కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు యువరైతు నర్సప్ప.
నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన పట్నం నర్సప్ప ఐటీఐ, డిగ్రీ పూర్తి చేశారు. ఒక్కడే కుమారుడు కావడంతో తండ్రి నుంచి వచ్చిన ఎనిమిది ఎకరాలు సాగుచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వరి, పత్తి, కంది పంటలు సాగు చేశారు. అయితే పత్తికి ధరలు స్థిరంగా లేకపోవడం, అతివృష్టి, అనావృష్టి కారణంగా బాగా నష్టాలు వచ్చాయి. కంది దిగుబడి కూడా అంతంత మాత్రంగానే వచ్చింది. దీంతో ఉద్యానశాఖ అధికారుల సూచన మేరకు 14 నెలల కిందట మూడెకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. దిగుబడి రావడానికి మూడేళ్ల సమయం పడుతుండటంతో అంతర పంటగా వివిధ రకాల కూరగాయలు సాగుచేసి ఆదాయం గడిస్తున్నారు. కూరగాయలతో రూ.90 వేలు.. : కూరగాయల సాగుతో ఆరు నెలల్లో రూ.90 వేల ఆదాయం పొందుతున్నారు రైతు నర్సప్ప. కేవలం పావు ఎకరంలో సాగుచేసిన మిర్చితోనే రూ.60 వేలకు పైగా ఆదాయం గడించారు. ప్రతిరోజూ తెంచిన మిర్చిని సొంతంగా సంతలకు తరలించి విక్రయిస్తున్నట్లు రైతు నర్సప్ప తెలిపారు. నాణ్యమైన



కూరగాయల విత్తనాలు గద్వాల, కర్నూలు నుంచి కొనుగోలు చేసి తెచ్చుకున్నట్లు చెప్పారు. టమాట విత్తనాలు, కూలీల ఖర్చు పోను అర ఎకరాకు రూ.30 వేల వరకు ఆదాయం వచ్చిందని చెప్పారు. గతేడాది మంచి ధరలు ఉండటంతో కేవలం అర ఎకరంలోనే రూ.2 లక్షల వరకు ఆదాయం పొందినట్లు తెలిపారు. రెండెకరాల్లో ఆయిల్ పామ్ తోట సాగుకు ప్రభుత్వం నుంచి మొదటి ఏడాది రూ.52 వేలు ప్రోత్సాహకం అందనుంది. దీంతోపాటు మొక్కల మధ్య పొలం వృథాగా ఉండకుండా అంతర పంటగా టమోటా, వంకాయ, బీరకాయ, మిర్చి సాగు చేయడంతో రైతు అదనపు ఆదాయం పొందుతున్నారు. మార్కెట్ డిమాండును బట్టి కూరగాయలు సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయంటున్నారు.

సందేహాలా.. సంప్రదించండి

బిజినేపల్లి : సాగులో రైతులకు ఎదురవుతున్న సమస్యలు, ఎరువులు, చీడపీడల యాజమాన్యంపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి ముందుకు వచ్చారు. మినహా మిగతా రోజుల్లో ఉదయం 11గంటల నుండి 12 గంటల మధ్య సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

## ఆసాంతం వివాదం.. బందెప్ప వ్యవహారం

వికారాబాద్ : టెన్త్ పరీక్ష ఇలా మొదలైందో లేదో కొద్ది నిమిషాల వ్యవధిలోనే ప్రశ్నపత్రం బయటకు వచ్చేసింది. అత్యంత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశామని చెబుతున్న చోటు నుంచే ఏకంగా వాట్సాప్‌లో అది ప్రత్యక్షమైంది. తాండూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (నం.1) కేంద్రంగా బందెప్ప అనే ఉపాధ్యాయుడి నిర్వాకం ఇందుకు కారణమైంది. ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలైంది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ అంశమై తీవ్రస్థాయిలో చర్చ సాగుతున్న ఈ తరుణంలోనే చివరకు పదో తరగతి ప్రశ్నపత్రాలనూ ఇలా బయటకు తెస్తే ఏంటనే ఆందోళన మొదలయ్యింది. ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయుడే ఈ పని చేశాడని తెలిసి అందరూ ఆయన తీరును తప్పుపడుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఎవరీ బందెప్ప అనే చర్చ మొదలుకావడంతో గతంలోనూ ఆయన పై ఉన్న ఆరోపణలు మరోసారి బహిర్గతమయ్యాయి.

చీటీల పంపిణీకి యత్నం

తాండూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(నం.1) వివాదాలకు నిలయంగా మారింది. రెండేళ్ల క్రితం పదోతరగతి పరీక్షల సమయంలో బయటి వ్యక్తులు చీటీలు అందించటానికి నానా హంగామా చేశారు. చీటీల అందజేత హంగామాపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యాధికారులు స్పందించారు. అప్పటి నుంచి పాఠశాల ఆవరణలోని మరో భవనంలో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

తొలుత ఉత్తిదేనంటూ కొట్టివేత

ఉదయం 9.37గంటలకే ప్రశ్నపత్రం సమ్మప్ప వాట్సాప్‌కు చేరింది. అదే సమయంలో లోకల్‌గా ఉన్న మరో గ్రూప్‌లోనూ పొరపాటున పోస్ట్ చేశాడు. విషయం వెలుగులోకి రావడంతో ఇదే విషయమై మండల విద్యాధికారి వెంకటయ్య దృష్టికి కొందరు తీసుకెళ్లగా తొలుత అలాంటిదేమీ లేదన్నారు. చివరకు వాస్తవం గ్రహించి పోలీసులు రంగంలోకి దిగారు. తొలుత ఒక గ్రూప్‌లో పోస్ట్ చేసి డిలీట్ చేయడంతో ఆ సమాచారం ఆధారంగా బందెప్పను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. దీంతో బండారం బయటపడింది.

ఆరోపణలొచ్చినా అక్కడే

ప్రభుత్వ ఉన్నత పాఠశాల (నం.1)లో చదివే ఒక బాలిక బందెప్ప తనను లైంగికంగా వేధిస్తున్నాడని గతంలో ఫిర్యాదు చేసింది. 2017లో వెలుగు చూసిన ఈ ఘటనపై ఆయనపై అప్పట్లోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. సస్పెన్షన్ వేటు పడకుండా వ్యవహారం చక్కబెట్టుకున్న బందెప్ప అప్పటి నుంచి ఇదే పాఠశాలలో కొనసాగుతున్నారు. కేసు విచారణ దశలో ఉంది. సోమవారం తెలుగు పరీక్ష ఉండగా.. ఆయనను రిలీవర్‌గా ఉంచారు. అయిదో నంబరు గదిలో ఇన్విజిలేటర్‌గా ఉన్న శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడి నుంచి చాకచక్యంగా ప్రశ్నపత్రాన్ని తీసుకున్న బందెప్ప.. ఆ వెంటనే ఫొటో తీసి సమ్మప్పకు పంపాడు. చెంగోల్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న సమ్మప్ప తనకు తెలిసిన విద్యార్థులకు లాభం జరిగేందుకే ప్రశ్నపత్రాన్ని బయటకు పంపినట్లు పోలీసులు తేల్చారు. అందుకే బందెప్పతో పాటు సమ్మప్పనూ సస్పెండ్ చేసిన అధికారులు క్రిమినల్ చర్యలకూ సిద్ధమయ్యారు.

# టెక్స్‌టైల్ పార్క్ భూసేకరణపై రైతుల ఆందోళన

కొడకండ్ల : కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు భూసేకరణపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తొలుత పార్క్ ఏర్పాటుకు ప్రధాన రహదారి పక్కనున్న 9.22 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ అధికారులు కనీసం 50 ఎకరాల స్థలం కావాలని కోరడంతో రెవెన్యూ అధికారులు స్థల సేకరణకు చర్యలు చేపట్టారు. కొడకండ్లకు దూరంగా మరో ప్రదేశంలో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ ఆ ప్రదేశంలో గుట్టలు ఉండటంతో అక్కరకు రాదని తిరస్కరించారు. దీంతో రెవెన్యూ అధికారులు మొదట గుర్తించిన 9.22 ఎకరాలకు తోడుగా దాని పక్కనున్న 20 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని సేకరించి పార్క్‌కు కేటాయించాలని ప్రతిపాదించారు. కొన్ని దశాబ్దాల క్రితం తమకు ప్రభుత్వం అందించిన 20 ఎకరాల భూములను అప్పగించే ప్రసక్తి లేదంటూ రైతులు తహసీల్దార్, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఆ భూమిలో సుమారు 2 ఎకరాల్లో మాత్రమే పట్టా భూములున్నాయని అధికారులు తెలిపారు. అసైన్డ్ భూములపైనే తమ జీవితాలు ఆధారపడి ఉన్నాయంటూ సుమారు వంద మంది రైతులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు



స్థల సేకరణ వివాదాస్పదం కానుంది.

భూములను అప్పగించే ప్రసక్తి లేదు

-గుండా పూర్ణచందర్, కొడకండ్ల

టెక్స్‌టైల్‌పార్కును ఏర్పాటు చేయడం హర్షణీయమైనప్పటికీ, మా జీవనాధారమైన సొంత వ్యవసాయ భూములను తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నాం. కొడకండ్లలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మా జీవనాధారమైన భూములను అప్పగించే ప్రసక్తి లేదు.

న్యాయ పోరాటానికైనా సిద్ధం

-కాగితం ఉప్పలయ్య, రైతు

మా తాతల కాలంలో ప్రభుత్వం అందించిన భూములనే ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్నాం. అప్పుడు ఇచ్చిన భూములను తిరిగి తీసుకుంటామనడం సమంజసం కాదు. అధికారులందరినీ వేడుకుంటున్నాం. చివరికి న్యాయ పోరాటానికైనా సిద్ధం. మా భూములను అప్పగించబోం.

# నిర్వహణలో నిర్లక్ష్యం

కరీంనగర్ :అందరికీ వ్యాయామం అందించేందుకు ఓపెన్‌జిమ్‌లు.. ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పార్కులు.. నడక కోసం వాకింగ్‌ట్రాక్‌లు నిర్మించేందుకు నగర పాలక సంస్థ ముందుకొచ్చి నిధులు కేటాయిస్తోంది. వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ పెంచితే కొన్నాళ్లపాటు చెక్కు చెదరకుండా ఉంటాయి. నగరంలో బహిరంగ వ్యాయామశాలల పరిస్థితిపై కథనం.కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పలు డివిజన్లలో బహిరంగ వ్యాయామశాలలు(ఓపెన్‌జిమ్‌లు) ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆయా ప్రాంతవాసులు నడకకు వచ్చే ప్రాంతాల్లో, పార్కు స్థలాలు, డివిజన్లలో ఖాళీగా ఉన్న స్థలాల్లో వీటిని బిగించారు. నిత్యం వందల సంఖ్యలో నగరవాసులు వ్యాయామం చేస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న వినతుల మేరకు 60 డివిజన్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినా.. సాధ్యం కాకపోవడంతో మొదటి దశలో పలు చోట్ల ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారు.

టైల్స్‌కు బదులుగా షీట్లు

గతంలో గచ్చు వేసి టైల్స్ వేసిన చోట ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయగా



ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్నాయి. కొత్తగా ఒక్కో జిమ్‌కు రూ.12 లక్షలు వెచ్చించి 10 వ్యాయామ పరికరాలు, ఫ్లోరింగ్‌లో రబ్బర్ షీట్లు వేస్తున్నారు. వర్షం పడినప్పుడు, వ్యాయామం చేసే సమయంలో నడిచే క్రమంలో తగులుతూ ఊడిపోతున్నాయి. కింద సిమెంటుతో ఫ్లోరింగ్ ఉండగా వీటికి పూసిన గమ్ ఉండటం లేదు. అవి చెల్లాచెదురుగా ఉండి అధ్వానంగా కనిపిస్తున్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో శనివారం ప్రారంభించిన పార్కులో రబ్బర్‌షీట్లు కనిపించలేదు. కొన్ని ఊడిపోవడంతో వాటిని తీసేశారు.

తెలిసినా అదే పద్ధతి..

వ్యాయామ పరికరాలు మొదట పది బిగించగా ఆయా ప్రాంతాల్లోంచి ఫిర్యాదులు వచ్చాయి. వర్షానికి నీరు నిలిచి.. అవి తేలిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎండకు సాగడం, ఆ తర్వాత బిగుసుకుపోవడంతో అవి ఊడుతున్నట్లుగా గుర్తించారు. వాస్తవంగా బయట ప్రదేశాల్లో కాకుండా లోపలి భాగంలో ఎండ తగలని ప్రాంతాల్లో షీట్లు పనికి వస్తాయని అంటున్నారు. అదేదీ గుర్తించకుండా నగరమంతా ఒకే ఫార్ములా అన్నట్లుగా ఇంజినీరింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు.

ఏజెన్సీ గుత్తేదారుదే బాధ్యత..

పరికరాలు బిగించిన తర్వాత మూడేళ్లపాటు సంబంధిత ఏజెన్సీ గుత్తేదారే నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. నగరంలో మాత్రం కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు రెండేళ్లు అవుతున్నాయి. పరికరాలు విరిగినా, బేరింగ్‌లు పాడైనా మరమ్మతులు చేయాల్సి ఉండగా రోజుల తరబడి వదిలేస్తున్నారు. పద్మానగర్‌లో ఉన్న జిమ్‌లో ఒక పరికరం చెడిపోయి రోజులవుతోంది. బ్యాంకు కాలనీలో అలాగే ఉంచారు. వీటిని చూసిన నాథుడే లేరు. పలు చోట్ల ఆ ప్రాంగణాలు శుభ్రంగా ఉండటం లేదు. అత్యధిక ప్రాంతాల్లో రబ్బర్ షీట్లు ఊడిపోయి ఉన్నాయి.

మరమ్మతులు చేయిస్తాం

ఓపెన్‌జిమ్‌ల నిర్వహణను ఏజెన్సీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. రబ్బర్‌షీట్లు ఊడిపోతే వెంటనే అతికించేలా చర్యలకు ఆదేశాలిస్తాం. పరికరాలను మరమ్మతులు చేయిస్తాం. ఫ్లోరింగ్ విషయంలో ఆలోచన చేస్తాం.నాగమల్లేశ్వరరావు, ఎస్‌ఈ,కరీంనగర్ నగర పాలిక సంస్థ

# ఉత్తి పోతల..



ఖమ్మం : సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను మాత్రం నిర్వీర్యం చేస్తోంది. నిధుల లేమితో కొన్నేళ్లుగా అనేక పథకాలు పడకేశాయి. మరమ్మతులు చేయిస్తే కొన్ని సామర్థ్యం మేరకు పని చేసి ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉన్నా... పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో సగానికి పైగా ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికే 19 చిన్న పథకాలు ఎందుకూ పనికిరావని, వాటికి మరమ్మతులు చేసినా ప్రయోజనం లేదని జలవనరుల శాఖ ఇంజినీర్లు తేల్చేశారు. జిల్లాలో పలు పథకాల మోటార్లు మొరాయిస్తున్నాయి. ఏళ్ల తరబడి వాటికి మరమ్మతులు లేనందున పనికి రాకుండా పోతున్నాయి. కొన్నిచోట్ల పైపులైన్లు ధ్వంసమయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఇనుప సామాను తస్కరణకు గురవుతోంది. ఉచిత విద్యుత్తు అందిస్తున్నా మోటార్లు పనిచేయక తమకు సాగునీరందని పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక జిల్లాలో 135 ఎత్తిపోతల పథకాలు ఉండగా 44,326 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో 50 పథకాలు మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా, 54 అసలే పనిచేయడం లేదు. పాక్షికంగా 12 పథకాలు పనిచేస్తున్నాయి. మరో 19 శిథిలమైపో యాయి. పని చేస్తున్న 50 పథకాల కింద 23,889 ఎకరాలు, పాక్షికంగా పనిచేసే వాటి కింద 9,296 ఎకరాల ఆయకట్టు ఉంది. మిగతా 11,141 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందక బీడుగా మారుతోంది. జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసేందుకు రూ.30.21 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రస్తుత వేసవిలో అయినా నిధులు మంజూరు చేస్తే మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది.ఎత్తిపోతల పథకాలు చిన్నపాటివి కొన్ని పనిచేయడం లేదు. పెద్దవి చాలా వరకు బాగున్నాయి. మరో మూడు నిర్మాణంలో ఉన్నాయి. త్వరలోనే పనులు పూర్తి చేసి ఆయకట్టు భూములకు సాగునీరందిస్తాం. మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు మంజూరైన తర్వాత పనులు చేపడతాం.

శంకర్‌నాయక్, సీఈ, జలవనరుల శాఖ, ఖమ్మం

సత్తుపల్లి, మధిర, పాలేరు నియోజకవర్గాల్లో ఎత్తిపోతల పథకాలు ఎక్కువగా ఉన్నాయి. మధిర నియోజకవర్గంలో 17, వైరాలో 2 పూర్తిగా వదిలేశారు. వీటికి మరమ్మతులు చేసినా వృథా అని తేల్చేశారు. దీంతో వాటిని లెక్కల్లోంచి తొలగించనున్నారు.

ఖమ్మం గ్రామీణ మండలంలో మున్నేరు నదిపై తీర్థాల వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం రెండేళ్ల కిందట వరదకు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. ఇలాంటివి జిల్లాలో చాలా ఉన్నాయి.కల్లూరు మండలం కొర్లగూడెం-2, మధిర మండలంలో మహదేవపురం, బోనకల్లు మండలం రాపల్లెలో మూడు పథకాలు రూ.28 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తూనే ఉన్నారు. కొర్లగూడెం పథకం 70 శాతం, మహదేవపురం పథకం 60 శాతం, రాపల్లె 20 శాతం మాత్రమే పూర్తి చేశారు. వీటి నిర్మాణం పూర్తయితే 3,058 ఎకరాల భూమి సాగులోకి వస్తుంది.

# పరిహారం పేరిట పరిహాసం



ఖమ్మం : ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ తవ్వకానికి భూములు కోల్పోతున్న రైతులకు జలవనరుల శాఖ నుంచి చెల్లించాల్సిన పరిహారం పరిహాసంగా మారింది. జిల్లాకు ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువల ద్వారా నీటిని అందించేందుకు 11 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం డీబీఎం-60 ప్రధాన కాలువను తవ్వింది. దీనికి అనుసంధానంగా కూసుమంచి ప్రాంతం వైపు నీరందించేందుకు 29ఆర్ కాలువ తీసింది. కోక్యాతండా ప్రాంతం నుంచి కూసుమంచితోపాటు గంగబందతండా, జుజ్జులరావుపేట, గట్టుసింగారం గ్రామ పంచాయతీల పరిధిలోని 4,800 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 7ఆర్ కాలువ తవ్వకం చేపట్టింది. ఇందుకు అవసరమైన భూసేకరణ చేసి కాలువ తవ్వకం చేపట్టారు. అయితే ఇందులో 14 మందికి సంబంధించి 11.18 ఎకరాల భూములకు పరిహారం చెల్లించే విషయంలో రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కాలువ తవ్వకం పనులు నిలిచిపోయాయి. ఎస్‌ఆర్‌ఎస్‌పీ నీరు కూడా ఈ ప్రాంతానికి చేరడం గగనం కావడంతో ఎనిమిదేళ్లుగా ఈ అంశం మరుగున పడింది.

భక్తరామదాసు అనుసంధానించడంతో..

2017లో భక్తరామదాసు పథకాన్ని డీబీఎం 60కు అనుసంధానించారు. తద్వారా 7ఆర్ పరిధిలోని రైతుల డిమాండ్ మేరకు పరిహారం విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. గత ఏడాది అక్టోబరులో ఎకరానికి రూ.15 లక్షల పరిహారం ఇచ్చేందుకు జలవనరుల శాఖ, రైతుల మధ్య ఒప్పందం కుదిరింది.

ఆరు నెలలుగా జాప్యం..

ఇరుపక్షాల ఒప్పందం నేపథ్యంలో ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో తగు జీఓ జారీ చేసింది. దీంతో రైతులకు పరిహారం చెల్లింపు, కాలువ తవ్వకం పనులు పూర్తయి వచ్చే సీజన్ నాటికైనా పాలేరు జలాలు తమ ప్రాంతానికి వస్తాయని 4,800 ఎకరాల ఆయకట్టు రైతులు ఆనందపడ్డారు. కానీ నేటికీ 11.18 ఎకరాల భూములు కోల్పోతున్న 14 మంది రైతులకు పరిహారం అందలేదు.

ఎస్‌ఆర్‌ఎస్‌పీ 7ఆర్ కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు పది రోజుల్లోగా పరిహారం మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది. సాంకేతిక పరమైన అంశం కారణంగా కొంత జాప్యం జరిగింది. చెల్లింపులు పూర్తయిన అనంతరం కాలువ తవ్వకం పనులు చేపడతాం. ఈ వేసవిలో పనులు చేపట్టి వచ్చే సీజన్‌లోగా నీరందిస్తాం.రమేశ్‌రెడ్డి, డీఈఈ జల వనరుల శాఖ


# ప్రకృతి కరుణించక..పెట్టుబడి సాయమందక!

ఖమ్మం:అన్నదాతలకు దన్నుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తోంది. అయితే ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం ఇప్పటివరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 9వేల మందికి అందలేదు. ప్రధానంగా పదకొండు ఎకరాలకు పైబడి సాగు భూములున్న కర్షకులకు 'రైతుబంధు' సాయం అందలేదని తెలిసింది. వీరంతా మూడు నెలలుగా నిరీక్షిస్తున్నారు.

ఉభయ జిల్లాల్లో..ఖమ్మం జిల్లాలో సుమారు 4వేల మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో దాదాపు 5వేల మంది కర్షకులకు యాసంగి పెట్టుబడి సాయమందాల్సి ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసీజన్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. యాసంగి సీజన్‌కు రైతుబంధు సాయం పంపిణీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 28న ప్రారంభమైంది. ఖమ్మం జిల్లాలో 3,07,611 మంది రైతులకు రూ.355.43 కోట్లు, భద్రాద్రి జిల్లాలో 1,45,000 మందికి రూ.214 కోట్లు అందాలి. ఎకరం లోపు భూవిస్తీర్ణం కలిగిన రైతులకు తొలిరోజు, రెండెకరాల లోపు ఉన్నవారికి రెండోరోజు.. ఇలా పదెకరాల లోపు రైతులకు పదిరోజుల్లోగా సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. ఈప్రక్రియ సుమారు 15 నుంచి 20 రోజుల్లోపు పూర్తవుతుంది. పదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు తొలి పది రోజుల్లోనే పెట్టుబడి సాయమందింది. ఆ తర్వాత నుంచి ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఇంకెన్నాళ్లో ఎదురుచూపులు?

మూడు నెలలు దాటుతున్నా ఉభయ జిల్లాల్లో వేలాది మంది అన్నదాతలకు రైతుబంధు సొమ్ము అందలేదు. వ్యవసాయశాఖ కార్యాలయాలు, కలెక్టరేట్ల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. అసలే ఈసారి సీజన్ కర్షకులకు పరీక్ష పెట్టింది. దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. పత్తి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధర దక్కలేదు. ఇవి చాలదన్నట్టు అకాల వర్షాలూ నిండా ముంచాయి. ప్రకృతి కరుణించక.. పెట్టుబడి సాయమందక అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారమే రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమవుతుందని వ్యవసాయశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.




కొంతమంది కర్షకులకు సంబంధించి ట్రెజరీలో పెండింగ్ అని చూపుతోందని చెబుతున్నారు.

నాకు పదకొండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 'రైతుబంధు' ద్వారా పెట్టుబడి సాయం రూ.57,500 అందాలి. కొంతమంది రైతుల ఖాతాల్లో సొమ్ము జమైనా నాకు మాత్రం అందలేదు. మూడు నెలలు గడుస్తున్నా రైతుబంధు సొమ్ము అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పెట్టుబడి సాయమందేలా అధికారులు కృషి చేయాలి.

ఏలూరి జగదీశ్వరరావు, మద్దుకూరు, చంద్రుగొండ మండలం

గోపాలపురంలో నాకు 13.30 ఎకరాల భూమి ఉంది. రూ.65 వేలకుపైనే రైతుబంధు సొమ్ము రావాలి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నా బ్యాంకు ఖాతాలో సొమ్ము జమకాలేదు. వ్యవసాయశాఖ అధికారులను అడిగితే రేపు, మాపు అంటున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత జాప్యం జరగలేదు. అధికారులు స్పందించి వెంటనే పెట్టుబడి సాయమందేలా చూడాలి.

రాచూరి ముక్తేశ్వరరావు, గోపాలపురం, దమ్మపేట మండలం

# నెరవేరని సింగరేణి ఉత్పత్తి లక్ష్యం

భూపాలపల్లి : భూపాలపల్లి ఏరియా సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించలేకపోయింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 57శాతం ఉత్పత్తినే సాధించగలిగింది. 49.60 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం ఉండగా కేవలం 28.50 లక్షల టన్నుల ఉత్పత్తే జరిగింది. సింగరేణి సంస్థ మొత్తంగా 74మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించుకోగా 67.13లక్షల టన్నులు చేసి 91శాతంతో నిలిచింది. ఈ సారి భారీ వర్షాలు కురవడంతో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. దీంతో గత ఏడాది ఆశించిన ఫలితాలు రాబట్టకపోకపోవడంతో వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేపోయింది.

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఐదు డివిజన్లలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని అధిగమించింది. ఇల్లెందు 108 శాతం, ఆర్జీ-1 120శాతం, ఆర్జీ-2 100శాతం, శ్రీరాంపూర్ 102శాతం, మణుగూరు 103శాతం ఏరియాలు లక్ష్యం సాధించాయి. భూపాలపల్లి ఏరియా 57శాతంతో చివరి స్థానంలో ఉండగా, కొత్తగూడెం, ఆర్జీ-3లు ఏరియాలు లక్ష్యానికి



దగ్గరగా ఉండిపోయాయి.

అనుకూలించని పరిస్థితులు

భూపాలపల్లి అన్ని డివిజన్ల కంటే బొగ్గు ఉత్పత్తిలో వెనుకంజలో నిలిచింది. లక్ష్యం 49.60 లక్షల టన్నులకుగాను కేవలం 28.50 లక్షల టన్నులు చేసి 57 శాతంతో నిలిచింది. ఉపరితల గనుల్లో మట్టి వెలికితీత లక్ష్యాన్ని చేధించలేకపోయాయి. దీంతో సకాలంలో బొగ్గు వెలికితీత జరగలేదు.కార్మికుల గైర్హాజరు శాతం పెరగడం మరో కారణం కాగా కౌన్సెలింగ్ ఇచ్చిన ప్రయోజనం లేదు.

# రూ.కోట్లు వ్యయం.. అలంకారప్రాయం

పెద్దపల్లి : పల్లెల్లో ఆఖరి మజిలీ కష్టాలు తీర్చేందుకు 'వైకుంఠధామం' పేరిట నిర్మించిన శ్మశానవాటికలు అధ్వానంగా మారాయి. మొక్కుబడి పనులతో నాణ్యత లోపించి పగుళ్లు బారాయి. గతేడాది భారీ వర్షాలకు దెబ్బతిన్నా మరమ్మతులు కరవయ్యాయి. చాలా చోట్ల అసంపూర్తి నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. బోరు, విద్యుత్తు వసతి సమకూర్చలేదు. రూ.కోట్లు వెచ్చించినా అలంకారప్రాయంగా వెక్కిరిస్తున్నాయి. స్థలాల కొరత, ఇతర కారణాలతో అనువైన ప్రాంతాల్లో నిర్మించలేదన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో వైకుంఠధామాల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

నీటి వసతి.. విద్యుత్తు లేదుఒక్కో శ్మశానవాటిక నిర్మాణానికి ఉపాధిహామీ కింద రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేశారు. మొదట్లో ఉపాధిహామీ సిబ్బంది పర్యవేక్షించగా పల్లెప్రగతి ప్రాధాన్యత పనుల పరిధిలోకి తీసుకొని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేశారు. జిల్లాలో 264 శ్మశానవాటికలకు గాను 116 ఉపాధిహామీ, 145 పంచాయతీరాజ్, 3 సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టారు. బోరు, విద్యుత్తు కనెక్షన్ల కోసం నిధులు వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా చాలా చోట్ల అమలుకు నోచుకోలేదు. మిషన్ భగీరథ కనెక్షన్ తీసుకోవాలని ఆదేశించినా ఊరికి దూరంగా ఉండటంతో సాధ్యం కావడం లేదు.బోరుబావి ఉన్నా నీటి కష్టాలే!పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలోని శ్మశానవాటికకు బోరుబావి ఉన్నా విద్యుత్తు కనెక్షను లేదు. డీడీ కడితేనే కనెక్షన్ ఇస్తామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో తాత్కాలికంగా కొద్ది దూరంలోని స్తంభం నుంచి కనెక్షన్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. డీడీ చెల్లించేందుకు నిధుల కొరత అడ్డంకిగా మారింది.

దెబ్బతిన్న వైకుంఠధామం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటలో మానేరు ఒడ్డున నిర్మించారు. గతేడాది భారీ వర్షాలకు వాగు ఉద్ధృతంగా ప్రవహించింది. వరద ధాటికి దెబ్బతిన్నా మరమ్మతు చేయడం లేదు. కొన్ని గ్రామాల్లో స్థలాల ఎంపిక ప్రహసనంగా మారింది. నీటి వసతులు కల్పించపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి.

ఆరుబయట స్నానాలు

సెంటినరీకాలనీ: పన్నూరులోని వైకుంఠధామంలో తవ్విన బోర్లు సింగరేణి ఉపరితల గనుల పేలుళ్ల కారణంగా కుప్పకూలాయి. దీంతో స్నానాల గదులు నిరుపయోగంగా మారాయి. వైకుంఠధామంలో నీరు రాకపోవడంతో అంత్యక్రియలకు హాజరైన వారు గతంలో సింగరేణి ఏర్పాటు చేసిన బోరుబావి వద్ద స్నానాలు చేస్తున్నారు.

పిల్లర్లకే పరిమితం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలో వైకుంఠధామం అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీగా ఉన్న సమయంలో రూ.10 లక్షలు కేటాయించగా పనులు పిల్లర్ల దశలోనే ఉన్నాయి. అంత్యక్రియల నిర్వహణకు, కర్మకాండలు జరపడానికి గదులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఊరికి దూరంగా నిర్మాణాలు

ఓదెల: మడకలో మానేరు ఒడ్డున నిర్మించిన శ్మశానవాటిక ప్రవాహ ఉద్ధృతికి పూర్తిగా నేలమట్టమైంది. ఉప్పరపల్లె, హరిపురం, లంబాడితండ, కనగర్తి గ్రామాల్లో ఊరికి దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. పలు చోట్ల నీటి సౌకర్యం అంతంతమాత్రంగానే ఉండగా, విద్యుత్ సరఫరా ఎక్కడా లేదు.

ధర్మారం ఆదర్శం

ధర్మారం: మండలంలో మల్లాపూర్ మినహా అన్ని చోట్లా వినియోగంలోకి వచ్చాయి. మల్లాపూర్‌లో నిర్మాణాలు పూర్తయినా దారి లేక నిరుపయోగంగా మారింది. ఎర్రగుంటపల్లి, కొత్తపల్లి, న్యూకొత్తపల్లి, లంబాడితండా(కె), మల్లాపూర్, నాయకంపల్లి, రామయ్యపల్లి శ్మశానవాటికలకు నీటి వసతి లేకపోవడంతో అవసరమైనప్పుడు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. 12 చోట్ల విద్యుత్తు వసతి లేకపోవడంతో సమీపంలోని వ్యవసాయ బావుల నుంచి వాడుకుంటున్నారు.జిల్లాలో వైకుంఠధామాల పరిస్థితి

మొత్తం శ్మశానవాటికలు 264

నిర్మించినవి : 263

అంచనా వ్యయం రూ.31.11 కోట్లు

ఖర్చైనవి: రూ.28.34 కోట్లు

# ఏదులాపురం సొసైటీలో రూ. 5 కోట్ల అక్రమాలు?

ఖమ్మం : ఖమ్మం గ్రామీణ మండలంలోని ఏదులాపురం సహకార సంఘంలో సుమారు రూ.5 కోట్లు అక్రమాలు జరిగినట్లు సమాచారం. ఖమ్మం గ్రామీణ మండలం మొత్తానికి ఏదులాపురం సహకార సంఘం ఒక్కటే ఉంది. ఈ సంఘం ఛైర్మన్, రైస్‌మిల్లర్లు కలిసి గత ఏడాది ధాన్యం కొనుగోళ్లలో సుమారు రూ.కోటికి పైగా ధాన్యం కొనుగోలు చేయకుండానే చేసినట్లుగా నకిలీ బిల్లులు సృష్టించి ప్రభుత్వ సొమ్ము కాజేసిన విషయం తెలిసిందే. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఆ సమయంలోనే సంఘం ఛైర్మన్, సీఈవోలు ఒకరిపై మరొకరు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ ఫిర్యాదులతో జిల్లా అధికారులు సంఘంలో 2013 నుంచి ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలపై 51 విచారణకు ఆదేశించారు. ఏదులాపురం సహకార సంఘం పరిధిలో 2013 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన అన్ని లావాదేవీలపై విచారణ చేపట్టారు. ఎరువులు, విత్తనాల వ్యాపారం, రైతులకు ఇచ్చిన పంట రుణాలు, ద్విచక్ర వాహనాలు, డెయిరీ రుణాలు అన్నింటిని పరిశీలించి వసూలు చేసిన రుణాలు బ్యాంకులో జమచేసిన వాటికి సరిపోల్చారు. సంఘం పరిధిలో చేసిన ఖర్చులు వాటికి సంబంధించిన ఆధారాలను నమోదు చేశారు. సంఘం రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు.



సిబ్బందిని, అధికారులను విచారించారు. వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించారు. రికార్డులను అన్నింటిని విచారణ అధికారులు తమ వెంట తీసుకెళ్లారు. అయితే రుణాల వసూలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లలో వచ్చిన కమీషన్లు, చేసిన ఖర్చులను పరిశీలించగా వాటికి పొంతన లేకుండా ఉన్నట్లు తెలిసింది. అన్నింటిని సరిపోల్చగా దాదాపుగా రూ.5 కోట్లు వరకు అక్రమాలు జరిగినట్లు విచారణలో వెలుగుచూసినట్లు సమాచారం. త్వరలో ఆ వివరాలు వెల్లడికానున్నట్లు తెలిసింది. అయితే ఈలోపే కొంత మంది తమ తప్పులను గుర్తించి ముందుగానే వాటి నుంచి తప్పించుకునేందుకు జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు వినికిడి. ఆరునెలలుగా..జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఏదులాపురం సహకార సంఘంలో సుమారు ఆరు నెలలుగా 51 విచారణ చేపట్టారు. ఆ విచారణ గురువారం ముగిసింది. విచారణ అధికారులు త్వరలోనే నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

# గిరి విద్యకు భరోసా

భద్రాచలం : భద్రాచలం మన్యం విద్యావ్యవస్థ దశదిశను మార్చేందుకు ఐటీడీఏ అధికారులు గిరిజన సంక్షేమ శాఖకు ఇటీవల కొన్ని ప్రతిపాదనలు పంపారు. దీనికి ఆ శాఖ కమిషనర్ అంగీకరిస్తే గిరిజన విద్యకు మరింత భరోసా లభిస్తుంది.

ఎందుకు అవసరం?

గిరిజన గురుకులాలు, ఆశ్రమాలు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో క్రమంగా బలోపేతమవుతున్నాయి. ఐటీడీఏ పరిధిలో డీడీ పర్యవేక్షణలో 1 నుంచి 5 వరకు గిరిజన ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతుండగా ఇందులో 5వేల మంది చదువుతున్నారు. ఆశ్రమాలు, వసతి గృహాలు పదో తరగతి వరకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో మన్యంలోని బాలబాలికలకు సమాన ఇంటర్ విద్యావకాశాలు సమకూర్చటంలో భాగంగా ఆరు జూనియర్ కళాశాలలు బాలికలకు, మరో ఆరు బాలురకు కావాలని నిర్ణయించారు. హెచ్ఈసీ, సీఈసీ, బైపీసీ, ఎంపీసీ వంటి నాలుగు గ్రూపులు.. ఒక్కోదానిలో 40 మంది చొప్పున 160 మంది చదువుకోవచ్చు 1,920 మంది నేరుగా, లేదా కౌన్సెలింగ్ ద్వారా ఇంటర్‌లో చేరడానికి వీలుంటుంది. ఆశ్రమాలలో పదో తరగతి చదివిన వారితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో చదివిన వారికి ఇదో చక్కని అవకాశంగా ఉంటుంది. ఇందుకోసం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖకు ప్రతిపాదనలు పంపారు.

ప్రతిపాదనలు ఇలా..హైస్కూల్ స్థాయిలో చదువులు ఆపకుండా ఉండేందుకు కొత్తగా జూనియర్ కళాశాలల ఏర్పాటు అవసరం. ఇది




ఖర్చుతో కూడుకున్న పని కావడంతో కొన్ని ఆశ్రమ పాఠశాలలను గిరిజన ఆశ్రమ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని డీడీ రమాదేవి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈసారి ఎలాగైనా అప్‌గ్రేడ్‌కు పచ్చజెండా ఊపుతారని అంచనా వేస్తున్నారు.

2022-23 విద్యా సంవత్సరంలో వీరంతా ఇంటర్ చదవాలంటే ఆశ్రమాల్లో అవకాశం లేదు. ఈ నేపథ్యంలో 12 ఆశ్రమాల్లో హైస్కూల్‌తో పాటు జూనియర్ కళాశాలలను నిర్వహించే సదుపాయాలున్నట్లు నివేదికలు పంపారు.

వేటిని ఉన్నతీకరించాలి? ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన విద్యార్థుల సంఖ్య పరిగణనలోకి తీసుకుని 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాఠశాలల్ని అప్‌గ్రేడ్ చేయాలని భావిస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లెందుతో పాటు ఖమ్మం జిల్లాలోని వైరా నియోజకవర్గాల్లో వీటి అవసరం ఉందని అంచనా వేశారు.

దమ్మపేట మండలంలోని అంకంపాలెం, దుమ్ముగూడెం మండలంలోని కె.రేగుబల్లి-1, పాల్వంచ మండలంలోని ఉల్వనూరు, పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి, గుండాల మండలంలోని కాచనపల్లి, సింగరేణి మండలంలోని గేట్ కారేపల్లి బాలికల ఆశ్రమాలను బాలికల జూనియర్ కళాశాలలు చేయాలని నివేదించారు.

పాల్వంచ మండలంలోని కిన్నెరసాని, దమ్మపేట మండలంలోని పార్కలగండి, ములకలపల్లి మండలంలోని కమలాపురం, దుమ్ముగూడెంలోని ఆర్లగూడెం, సింగరేణిలోని ఉసిరికాయలపల్లి, ఇల్లెందులోని బొజ్జాయిగూడెం బాలుర ఆశ్రమాలను బాలుర జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించాలని విన్నవించారు.

# శిథిల భవనాల నీడలో బిక్కుబిక్కుమంటూ...



ఆదిలాబాద్ : జిల్లా వ్యాప్తంగా శిథిల భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏడెనిమిదేళ్లుగా భవనాల కూల్చివేతపై అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండటంతో ప్రజల్లో మరింత ఆందోళన మొదలైంది. వాస్తవంగా సంబంధిత శాఖల నివేదిక మేరకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఏదో ఒకశాఖ క్షేత్రస్థాయి పరిశీలన చేసి భవన కూల్చివేతకు నివేదిక ఇస్తుంది. ఇలా నివేదికలు ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా కూల్చివేతపై నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంతో ఎవరికి ముప్పు తెచ్చిపెడుతుందననే భయం సర్వత్రా వ్యక్తమవుతోంది. చాలా చోట్ల భవనాల పరిసర ప్రాంతాల్లో జనసంచారం ఉండటంతోనే కూల్చివేత అనివార్యంగా మారింది. మరోపక్క కూల్చివేసేందుకు డబ్బులు ఎవరు ఇవ్వాలనే పేచీతో జాప్యం అవుతోందని అధికారులు చెబుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు! భీంపూర్ మండలం పిప్పల్‌కోటిలోని రక్షిత మంచినీటి ట్యాంకు ఇది. శిథిలావస్థకు చేరి ప్రమాదకర స్థితిలో ఉన్న ఈ ట్యాంకు ఎప్పుడు కూలుతుందోననే భయంతో నీటి సరఫరాను నిలిపేశారు. రెండు సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉన్న దీన్ని కూల్చివేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం నివేదిక ఇచ్చింది. కూల్చేందుకు ఏ నిధులు కేటాయించాలో తెలియక పంచాయతీ పాలకవర్గం ఏమి చేయలేకపోతోంది. వర్షాకాలం వచ్చిందంటే ట్యాంకు పరిసర ప్రాంతవాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

పాలనాధికారి ఆదేశించినా!

తలమడుగు మండల కేంద్రంలో చౌకధరల దుకాణం(డీఆర్ డిపో) పక్కనే ఉన్న ప్రయాణప్రాంగణం. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన ఈ దుకాణ సముదాయాన్ని కూల్చివేయాలని రెండేళ్ల కిందట అప్పటి పాలనాధికారి దివ్యదేవరాజన్ ఆదేశించారు. అధికారులు స్పందించకపోవడంతో జడ్పీటీసీ గణేశ్‌రెడ్డి ప్రస్తుత పాలనాధికారి సిక్తా పట్నాయక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు ఎనిమిది నెలల కిందట ఆర్అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కూల్చివేయాలని నివేదిక ఇచ్చారు. ఇప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు.

ఏళ్లనాటి భవనం!

ఇది బోథ్ మండల తహసీల్దార్ కార్యాలయం. నిజాం కాలంలో నిర్మించిన ఈ భవనం బీటలు వారడంతో ప్రమాదకరంగా తయారైంది. వర్షాకాలంలో ఉద్యోగులు భయంతో విధులు నిర్వహిస్తుండగా.. కార్యాలయానికి వచ్చిపోయే సందర్శకులు ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థ భవనాల జాబితాలో చేర్చిన అధికారులు కూల్చేందుకు మాత్రం తాత్సారం చేయడం విమర్శలకు తావిస్తోంది.

క్షేత్రస్థాయి సందర్శన!

జిల్లా పాలనాధికారి సిక్తా పట్నాయక్ ఇటీవల ఆదిలాబాద్ గ్రామీణ మండలం అంకోలి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన చిత్రమిది. అక్కడ భవనం పగుళ్లు తేలి ప్రమాదకరంగా మారడంతో స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. 'మన ఊరు – మన బడి' కింద ఎంపికైన ఈ పాఠశాల గదుల మరమ్మతులకు తగు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.

# వీడని నిర్లక్ష్యం.. నీటిపథకాలే సాక్ష్యం



నిర్మల్ : అసలే వేసవి. ఇప్పటికే మిషన్ భగీరథ, మున్సిపల్ నల్లా నీళ్లు సక్రమంగా సరఫరా లేక పట్టణవాసులు పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు నీళ్లొస్తాయో.. రావో తెలియక దప్పికతో అల్లాడుతున్నారు. సమస్యను తీర్చేందుకు గతంలో కాలనీల్లో ఏర్పాటు చేసిన మినీ రక్షిత మంచినీటి పథకాలు పలుచోట్ల పనిచేయకపోవడంతో ఇంటి అవసరాల కోసం నీళ్లు లేక తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..జిల్లాలోని మూడు బల్దియాల్లో మినీ నీటి ట్యాంకులు మొత్తం 316 ఉన్నాయి. వాటి నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పలుచోట్ల పనిచేయక వృథాగా ఉన్నాయి. బోరు మోటార్లకు మరమ్మతులు చేయడం లేదు. ట్యాంకులకు పైకప్పులు, నల్లాలు సైతం లేవు. మున్సిపల్ నల్లా, భగీరథ నీళ్లు సరిగ్గా సరఫరా లేక తాగేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఇటు పథకాలు పనిచేయక మరిన్ని కష్టాలు తెస్తున్నాయి.

మీటర్లు లేవని..నిర్మల్ బల్దియాలో విలీనమైన మంజులాపూర్ గ్రామాన్ని 18, 19 వార్డులుగా విభజించారు. పంచాయతీగా ఉన్న సమయంలో పలుచోట్ల మినీ ట్యాంకులు, బోరుబావులు వేసి స్థానికుల సమస్యలు తీర్చారు. అయితే ప్రస్తుతం వాటికి మీటర్లు లేవనే కారణంతో సంబంధిత అధికారులు కనెక్షన్లు తొలగించారు. ఖానాపూర్‌లో విద్యుత్తు బిల్లుల భారంతో పలుచోట్ల ట్యాంకులను వినియోగించకుండా చేతిపంపులు వేశారు.

బోరు మోటారు నుంచే..

లిబోరు మోటారు నుంచి ఇళ్లలోకి పైపులు వేసిన ఈ దృశ్యం ఖానాపూర్‌లోని బర్కత్‌పురలోనిది. దీనికి అధికారులు కరెంటు కనెక్షన్ తొలగించడంతో అది నిరుపయోగంగా మారింది. స్థానికులు బోరుకు ఇలా పైపులు వేసి ఇళ్లలోకి నీటిని మళ్లించుకుంటున్నారు. ఇలాంటివి ఇక్కడ పలుచోట్ల ఉన్నాయి.

రంగులు వేశారు.. నిర్వహణ మరిచారు

లి రంగులు వేసి అందంగా ముస్తాబు చేసిన ఈ ట్యాంకు నిర్మల్‌లోని శాంతినగర్‌లోనిది. పట్టణవ్యాప్తంగా ఉన్న మినీ ట్యాంకులకు ఇలా రంగులు వేశారు. అయితే వాటి నిర్వహణ విషయంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఇక్కడ పలు ట్యాంకులు పనిచేయక, బల్దియా నీళ్లు రాక స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. వాటర్ ట్యాంకర్ సైతం సక్రమంగా రావడం లేదని వాపోతున్నారు.

లి కనెక్షన్ తొలగించి, వృథాగా మారిన ఈ మినీ నీటిట్యాంకు.. జిల్లా కేంద్రంలోని 19వ వార్డు మంజులాపూర్ అంబేడ్కర్ కాలనీలోనిది. మోటారుకు మరమ్మతులు చేయకపోవడంతోపాటు, మీటరు లేదన్న కారణంతో.. విద్యుత్తు అధికారులు బోరు మోటారు నుంచి ఉన్న కనెక్షన్‌ను తొలగించారు. పది రోజులుగా స్థానికులు ఇంటి అవసరాల కోసం వినియోగించుకునే నీళ్లు కరవై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే గ్రామంలోని 18, 19 వార్డుల్లో మరో నాలుగింటి కనెక్షన్లు తీసేశారు.

లేఖలు అందిస్తున్నారు

– మధుసూదన్, డీఈ, విద్యుత్తు శాఖ, నిర్మల్

బోరు మోటార్లకు తప్పనిసరిగా మీటర్లు ఏర్పాటు చేయించాలి. అవి లేకపోవడంతోనే కనెక్షన్లు తొలగించాం. వీటికి సంబంధించిన డీడీల లేఖలను ప్రస్తుతం మున్సిపల్ వారు అందజేస్తున్నారు. సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం.

అధికారులకు విన్నవించాం– వినయ్, ఏఈ, పురపాలక సంఘం, నిర్మల్

మీటర్ల ఏర్పాటు విషయంపై ఇప్పటికే విద్యుత్తు శాఖ అధికారులకు విన్నవించాం. డీడీలు కడుతున్నాం. అప్పటి వరకు సమస్యను తీర్చేందుకు సరఫరాను ఇవ్వాలని కోరాం. ట్యాంకుల నిర్వహణ, మరమ్మతుల విషయంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

# గతి తప్పిన గ్రామీణ వైద్యం

ఖమ్మం : ఇష్టారీతిన గర్భస్రావాలు, అధిక మోతా దులో యాంటి బయాటిక్స్ వినియోగం, చిన్నారులకు సైతం మోతా దుకు మించిన మందుల డోసు.. ఇష్టారీతిన ఇంజక్షన్లు చేయడం, అధీ కృత దుకాణాల్లో విక్రయించాల్సిన మందులను సైతం స్వయంగా విక్ర యం.. వీటన్నింటికీ మించి తనవద్దకు వచ్చిన రోగులను పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేసి కమీషన్లు దండుకోవడం.. ఇదీ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న మెజారిటీ గ్రామీణ వైద్యుల పనితనం.. కొందరికి రోగులకు పట్టణాల్లోని ప్రైవేటు ఆసు పత్రులకు తీసుకెళ్లి కమీషన్లు దండుకోవడం నిత్యకృత్యంగా మారింది. కేవలం ప్రాథమిక చికిత్సలు మాత్రమే చేయాల్సిన గ్రామీణ వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా రోగులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఇష్టా రీతిన యాంటీబయాటిక్స్ ఇస్తుండడంతో కిడ్నీలు చెడిపోయి కొందరు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొందరు ఆర్ఎంపీలు కొన్ని ప్రభుత్వాసుపత్రులనుంచి అక్రమంగా మందులను తీసుకొచ్చి తమ ఇళ్లల్లో ఉంచి రోగులకు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. భద్రాచలంలో ప్రాక్టీసు చేసే కొందరు ప్రైవేటు వైద్యుల వద్ద ఉండాల్సిన మందుల కంపెనీల శాంపిల్స్‌ను తెచ్చి మరి కొందరు వినియోగిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నిఘా కొరవడడంతోనే వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. డ్రగ్ కంట్రోల్ అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వీరు మరింత బరితెగిస్తున్నారు. కొందరు గ్రామీణ వైద్యులు కాసుల కక్కుర్తితో ఇష్టారీతిన గర్భస్రావాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివాసీ ప్రాంతాల్లో వీరి ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గత నెలలో దుమ్ముగూడెం మండలం చిన బండిరేవులో ఓ గ్రామీణవైద్యుడి వద్ద రూ.60వేల విలువ గల మందు లను డ్రగ్స్ తనిఖీ విభాగం అధికారులు కేసు నమోదు చేశారు.

# గుట్టలు కరిగిస్తూ.. గుట్టుగా తరలిస్తూ

కరీంనగర్ : గంగాధర మండలంలో మొరం మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా అధికారులకు మాముళ్లు ముట్టజెప్పుతూ వరదకాలువ, గ్రామాల్లోని గుట్టలను తవ్వుతూ గుట్టుగా మొరం తరలిస్తున్నారు. సహజ వనరులను ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీన్ని ఆసరాగా తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండలు, గుట్టలు, వరదకాలువ నుంచి మొరం తరలిస్తున్నారు. మండలంలోని ర్యాలపల్లి,



బూరుగుపల్లి, కొండయ్యపల్లి, నాగిరెడ్డిపూర్, కురిక్యాల, రంగరావుపల్లి, కొండన్నపల్లి, గట్టుబూత్కూర్, గర్షకుర్తి, ఆచంపల్లి గ్రామాల్లో వరద కాలువ మట్టిని వ్యాపారులు అక్రమంగా తరలిస్తున్నారు. వరద కాలువ పరివాహక గ్రామాల్లో కాలువ మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తుంటారు. మట్టిని తరలించడానికి నీటి పారుదల శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపారులు అధికారులకు మాముళ్లు ముట్టజెప్పి దందాను పెద్దఎత్తున నడిపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. క్యూబిక్ మీటర్ లెక్కన ప్రభుత్వానికి చాలన్ కట్టి మట్టిని తరలించాలి. కానీ ఏ అనుమతులు లేకుండా వ్యాపారులు యథేచ్ఛగా మొరం, మట్టిని తరలిస్తున్నారు. వరద కాలువకు గాయత్రి పంపుల నుంచి నీటిని విడుదల చేయడంతో నిత్యం నీటిపారుదల శాఖ అధికారులు కాలువ వెంట పర్యవేక్షిస్తుంటారు. వారి కళ్ల ముందు నుంచే ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. గంగాధర, కొడిమ్యాల మండలాల సరిహద్దులోని గుట్ట వందల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ గుట్టపై ఉన్న చెట్లను తొలగించి ఎర్రని మట్టిని తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకుని మొరం అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అడుగంటుతున్న భూగర్భజలాలు

కరీంనగర్ : జిల్లాలో భూగర్భ జలాలు రోజు రోజుకు అడుగంటుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఈ పరిస్థితి ఉంటే మే, జూన్ నాటికి తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. భూగర్భ జలాల ఆధారంగా సాగుచేసిన మెట్ట ప్రాంత రైతులు వరి పంట చేతికి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. జనవరితో పోల్చితే ఫిబ్రవరి నెలాఖరు వరకు మీటరు లోతుకు నీరు పడిపోగా ప్రస్తుతం మార్చి 20 నాటికి అవి మరో మీటరు లోతుకు పడిపోయి ఉంటాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాల్లో భూగర్భ జలాల ఆధారంగా వరి సాగు చేసిన రైతులు సుమారు 25 వేల ఎకరాల పంటపై ఆశలు వదులుకుంటున్నారు. – జిల్లాలో 2021 నవంబరులో సగటున 3.65 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. డిసెంబరు నాటికి అవి 4.83 మీటర్ల లోతుకు, జనవరి నాటికి 5.13 మీటర్ల లోతుకు పడిపోయాయి. – ఈ సంవత్సరం ఫిబ్రవరి మాసాంతానికి 5.96 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. మార్చి మాసాంతం వరకు ఏడు మీటర్లకుపైగా లోతుకు వెళితేగాని భూగర్భ జలాలు లభ్యమయ్యే అవకాశం లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. – ప్రతినెల సగటున మీటరు నుంచి రెండు మీటర్ల లోతు వరకు నీరు పడిపోతూ వస్తున్నది. గత సంవత్సరం ఫిబ్రవరితో పోల్చితే ఈ సంవత్సరం భూగర్భ జలాలు మీటరు లోతుకంటే ఎక్కువగా పడిపోయాయి. – 2021 ఫిబ్రవరిలో 6.88 మీటర్ల లోతున నీరు ఉండగా, ఈ సంవత్సరం భూగర్భ జలాలు 5.96 మీటర్లకు పడిపోయాయి. – ఐదు మండలాల్లో ఆందోళనకర పరిస్థితిజిల్లాలోని తిమ్మాపూర్, గంగాధర, చొప్పదండి, చిగురుమామిడి, గన్నేరువరం మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళన కలిగిస్తున్నది. గంగాధర మండలంలో ఫిబ్రవరి నెలాఖరుకు భూగర్భజలాలు 16.28 మీటర్లకు, తిమ్మాపూర్ మండలంలో 10.33 మీటర్లకు, చొప్పదండిలో 9.10 మీటర్లకు, చిగురుమామిడిలో 8.68 మీటర్లకు, గన్నేరువరం మండలంలో 8.36 మీటర్లకు పడిపోయాయి. మిగతా మండలాల్లో 3.5 మీటర్ల నుంచి ఆరు మీటర్ల లోతున భూగర్భ జలాలు లభిస్తున్నాయి. – జిల్లాలో 2.3 లక్షల ఎకరాల్లో వరి సాగువర్షాకాలంలో జల వనరులన్నీ నిండడంతోపాటు కాళేశ్వరం జలాలు అందుబాటులో ఉండడంతో జిల్లావ్యాప్తంగా 2 లక్షల 30 వేల పైచిలుకు ఎకరాల్లో వరిసాగు చేశారు. కాలువ, చెరువుల ఆధారంగా సాగు చేసిన వారికి పెద్దగా ఇబ్బందులు ఎదురుకావడం లేదు. పూర్తిగా భూగర్భ జలాలపైనే ఆధారపడి వరి సాగు చేసిన రైతుల పొలాలు ఇప్పుడే ఎండిపోతున్నాయి. మరో నెల రోజుల నాటికి పరిస్థితి విషమించి పంట చేతికి వచ్చే అవకాశమే లేకుండా పోతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రధానంగా చొప్పదండి, గంగాధర, రామడుగు మెట్ట ప్రాంతాల రైతులు 25 వేల ఎకరాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పంట దక్కించుకునే అవకాశాలు లేవని వాపోతున్నారు. చొప్పదండి మండలంలోని కాట్నపల్లి, గుమ్లాపూర్, సాంబయ్యపల్లి, చిట్యాలపల్లి, మంగళపల్లి, రేవెల్లి గ్రామాల్లో ఆరు వేల ఎకరాలలో సాగు చేసిన వరి పైర్లు ఎండిపోతున్నాయి. గంగాధర మండలంలోని 12 గ్రామాల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉన్నది. ర్యాలపల్లి, కొండయ్యపల్లి, చెర్లపల్లి, సర్వారెడ్డిపల్లి, కోట్లనర్సింహులపల్లి, మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, ఉప్పరమల్యాల, గర్షకుర్తి, వెంకంపల్లి, కాసారం, ఒద్యారం గ్రామాల్లో సుమారు 13 వేల ఎకరాల వరి పైరు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రామడుగు మండలంలో ఎనిమిది వేల ఎకరాల్లో సాగు చేసిన వరి పైరుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ మండలంలోని కొరటపల్లి, దేశరాజ్‌పల్లి, వెలిచాల, గోలిరామయ్యపల్లి, మోతె, దత్తోజిపేట, వన్నారం, కొక్కెరకుంట, లక్ష్మీపూర్, గుండి, తదితర గ్రామాల్లో వరి పైర్లు ఎండిపోతున్నాయి. గతంలో ఈ గ్రామాలకు కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని మళ్లించి పంటను కాపాడేవారు. ఈ సంవత్సరం ఆ నీటితో చెరువులు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి వరికి నష్టం వాటిల్లుతున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఈ గ్రామాలకు పైపులైన్ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయి తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మిషన్ భగీరథ నీటి వనరులన్నింటికి నీటి కొరత లేకుండా చూడని పక్షంలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని ఆందోళన వ్యక్తమవుతున్నది.

# మీ బిడ్డ ఒకవైపు.. తోడేళ్లన్నీ ఒకవైపు: చిలకలూరిపేట సభలో సీఎం జగన్




పల్నాడు: ఆరోగ్యశ్రీ పథకం పేరు వినగానే మహానేత వైఎస్సార్ గుర్తొస్తారు. ఖరీదైన కార్పొరేట్ పథకాన్ని పేదలకు అందించిన ఘనత వైఎస్సార్‌ది. అలాంటి గొప్ప పథకాన్ని వైఎస్సార్ చనిపోయాక నీరుగార్చారన్నారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గురువారం చిలుకలూరిపేట లింగంగుంట్లలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. పేదల ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం ఇది. అందుకే వైద్య ఆరోగ్యం కోసం ఖర్చుకు వెనకడాడం లేదు. చంద్రబాబు పెట్టిన ఆరోగ్యశ్రీ బకాయిలను సైతం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. 2,265 ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ విస్తరించాం. ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి 3,300 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటిదాకా 9 వేల కోట్లు ఖర్చు చేశాం. అలాగే.. ఆరోగ్య ఆసరా కోసం రూ. 900 కోట్లు ఖర్చుచేశాం. ఇప్పటి దాకా 35 లక్షల 71 వేలపైగా మంది ఆరోగ్య సేవలను పొందారు. చంద్రబాబు పాలనలో వైద్య ఆరోగ్య రంగాలపై రూ. 8వేల కోట్లు ఖర్చు చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై రూ. 18 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆశా వర్కర్ల జీతం పెచాం. పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పీహెచ్‌సీలను ఏర్పాటు చేశాం. ప్రభుత్వాసుపత్రుల్లో 49వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. రాష్ట్రవ్యాప్తంగా మరో 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నాం. శిథిలావస్థకు చేరుకున్న మరో 11 మెడికల్ కాలేజీల రూపురేఖలు మారుస్తున్నాం. వైద్య ఆరోగ్య రంగంలో 48, 639 ఉద్యోగాలు కల్పించాం. రాష్ట్రంలో స్టాఫ్ నర్సుల పోస్టులు వంద శాతం భర్తీ చేశాం. రాష్ట్రంలో 96 శాతం స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు భర్తీ చేశాం. నూరు శాతం ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులు భర్తీ చేశాం. మనది బ్రతికించే ప్రభుత్వం. ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం. లంచాలు, వివక్ష లేకుండా పాలన చేస్తున్నాం. అన్ని రంగాల్లో అభివృద్ధికి అడుగులు వేస్తున్నాం. బటన్ నొక్కి 2 లక్షల 5 వేల 108 కోట్ల సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఆర్థిక, రాజకీయ, సామాజిక విప్లవం ప్రతీ గడపకూ కనిపిస్తుంది. స్కాములు తప్ప స్కీములు తెలియని బాబులు.. సామాజిక న్యాయం తెలియని పరాన్న జీవులు అంటూ ప్రతిపక్ష టీడీపీ అండ్ కోను సీఎం జగన్ ఏకిపారేశారు. మీ బిడ్డను ఎదుర్కొనలేక తోడేళ్లన్నీ ఒక్కటవుతున్నాయి. ఎత్తులు, జిత్తులు, పొత్తులు, కుయుక్తులతో రాజకీయాలు చేస్తున్నారు. నాకు పొత్తుల్లేవ్. పొత్తులపై ఆధారపడను. నాకు పొత్తు ఉంటే అది మీతోనే(ప్రజలతోనే) అని సీఎం జగన్ పేర్కొన్నారు. నవరత్నాలతో మీ బిడ్డ వస్తుంటే.. తోడేళ్లంతా ఒక్కటవుతున్నాయి. వాళ్లలా నాకు అర్థబలం, అంగబలం లేకపోవచ్చు. వాళ్లకు లేనిది నాకు ఉంది.. దేవుడి దయ, ప్రజల చల్లని దీవెనలు. నాకు తెలిసింది ఒక్కటే. నేను నేరుగా చెప్తా. ఏదైతే చెప్తానో అదే చేస్తా.. మీ ఇంట్లో మంచి జరిగితే తోడుగా ఉండండి. మీ బిడ్డకు మీరే సైనికులు అంటూ సీఎం జగన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.




**తినేందుకు ఆహారం, చేసేందుకు పని లేక అష్టకష్టాలు పడుతున్న ప్రజలను పాకిస్థాన్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తమ ప్రజల ఆకలి బాధలు తీర్చే బాధ్యతను విస్మరించిన షెహబాజ్ ప్రభుత్వం నిత్యావసరాలపై ఇస్తున్న సబ్సిడీని ఎత్తేసింది. అండగా నిలవాల్సిన సమయంలో పాక్ ప్రభుత్వం తమను వెన్నుపోటు పొడిచిందని స్థానిక ప్రజలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

# సభాపతిగా సభను నడిపిన విధానాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికీ మరచిపోరు



అమరావతి: రాష్ట్ర ప్రయోజనాల పట్ల, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత కలిగిన..మా పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌కి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. “సహనం, సౌశీల్యం కలిగిన మనోహర్..ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభాపతిగా సభను నడిపిన విధానాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికీ మరచిపోరు. మా పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ బాధ్యతలను ఎంతో నేర్పుగా నిర్వర్తిస్తున్నారు. పార్టీలోని క్షేత్ర స్థాయి జన సైనికులు, వీర మహిళల నుంచి నాయకుల వరకూ అందరినీ సమన్వయం చేస్తూ ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన అనుభవం ఎంతో దోహదపడుతోంది.

నాదెండ్ల మనోహర్ సుఖసంతోషాలు, సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవదేవుడు వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నానని” పవన్ కల్యాణ్ తెలిపారు.




దిల్లీ: ఆర్-5 జోన్ వ్యవహారంపై అమరావతి ప్రాంత రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రైతులు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనిపై ఈనెల 14న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. 10న విచారణకు తీసుకోవాలని రైతుల తరఫున న్యాయవాది కోరగా.. ఆరోజు కేసుల జాబితా ఇప్పటికే తయారైందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. అందుకే ఈ పిటిషన్‌ను 14న విచారణకు తీసుకుంటామని చెప్పారు. అమరావతి రైతులు ఆర్-5 జోన్‌పై ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధాని అమరావతిలోని 900 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలుగా బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)లో మార్పులు చేస్తూ ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# బడ్జెట్ సమావేశాలు.. రాజ్యసభ 31, లోక్‌సభ 45 గంటలు



దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ముగిశాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో అధిక భాగం వాయిదాల పర్వమే కొనసాగింది. దీంతో ఉభయ సభలు షెడ్యూల్ కంటే చాలా తక్కువ సమయమే పనిచేశాయి. మలివిడత బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ మొత్తం 45 గంటలు, రాజ్యసభ 31 గంటల పాటు పనిచేసిందని ఓ థింక్‌థాంక్ సర్వే డేటా వెల్లడించింది. పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు మార్చి 13న ప్రారంభమయ్యాయి. అయితే అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక వ్యవహారం ఉభయ సభలను కుదిపేసింది. ఈ ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని విపక్షాలు పట్టుబట్టాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగాయి. దీంతో సభలు తరచూ స్తంభించాయి. ప్రణాళిక ప్రకారం.. లోక్‌సభ మొత్తం 133.6 గంటలు పనిచేయాల్సి ఉండగా కేవలం 45 గంటలు (34.28శాతం) పనిచేసింది. ఇక రాజ్యసభ (%ఘుయిఘు ఘుఎఘు%)ను 130 గంటలు నిర్వహించాల్సి ఉండగా.. 31 గంటల (24శాతం) పాటు మాత్రమే పనిచేసిందని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసర్చ్ డేటా వెల్లడించింది. లోక్‌సభలో 4.32 గంటలు, రాజ్యసభలో 1.85 గంటలు.. ప్రశ్నోత్తరాల కోసం కేటాయించారు. ఈ ఉదయం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బడ్జెట్ సమావేశాలు ముగిసినట్లు ప్రకటిస్తూ సభను నిరవధికంగా వాయిదా వేశారు. 14.45 గంటల పాటు సాధారణ బడ్జెట్‌పై చర్చించగా.. 145 మంది ఎంపీలు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై 13.44 గంటల పాటు చర్చ జరగ్గా.. 143 మంది ఎంపీలు పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాల్లో మొత్తం 8 బిల్లులను ప్రవేశపెట్టగా.. విపక్షాల ఆందోళనల నడుమే ఆరు బిల్లులకు లోకసభ ఆమోదం తెలిపింది.

# ఏపీలో ఆ వాహనాల రిజిస్ట్రేషన్‌కు కొత్త నంబర్ సిరీస్



అమరావతి: ఏపీలో ప్రభుత్వ వాహనాలకు కొత్త రిజిస్ట్రేషన్ నంబర్ సిరీస్‌ను తీసుకొచ్చేందుకు రవాణాశాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇకపై ప్రభుత్వ వాహనాలకు AP 40G అనే కొత్త రిజిస్ట్రేషన్ నంబర్ ఇచ్చేందుకు వీలుగా మోటారు వాహనాల చట్టంలో సవరణ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నూతనంగా ప్రభుత్వం కొనుగోలు చేసే వాహనాలకు ఇకపై ఈ సిరీస్‌తో నంబర్లను కేటాయించను న్నారు. వివిధ అవసరాల రీత్యా ప్రభుత్వం కొనుగోలు చేసే వాహనాలకు మాత్రమే ఆ 40 సిరీస్‌ను ఇవ్వనున్నట్లు నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది. 2018 చివరి నుంచి ప్రైవేటు వాహనాలకు రవాణాశాఖ 39 సిరీస్‌ను జారీ చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను వేరు చేసేలా ఇకపై ఈ కొత్త సిరీస్‌ను తీసుకొచ్చారు. దీనిపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలను కోరుతున్నట్లు నోటిఫికేషన్‌లో రవాణాశాఖ పేర్కొంది.




**నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తాను లేవనెత్తిన ప్రజా సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగబోదని వైకాపా బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టంచేశారు. సమస్యల పరిష్కారం కోసం జలదీక్షకు దిగిన తనను పోలీసులు అన్యాయంగా గహనిర్బంధం చేశారని విమర్శించారు. నిధులు మంజూరు చేస్తూ సీఎం జగన్ చేసిన సంతకానికే దిక్కులేకపోతే ఎల? అని శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు.**

# ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గృహనిర్బంధం



నెల్లూరు: వైకాపా నుంచి సస్పెండైన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. నగరంలోని మాగుంట లేఔట్‌లోని నివాసం నుంచి బయటకు వెళ్లకుండా ఆయన్ను అడ్డుకున్నారు. అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో తన ఇంటి వద్దే కోటంరెడ్డి బైఠాయించి నిరసన తెలిపారు. పొట్టెపాలెం కలుజు వద్ద వంతెన నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ 8 గంటలపాటు జలదీక్షకు కోటంరెడ్డి పిలుపునిచ్చారు.

ఆ నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ఆయన సిద్ధమవడంతో పోలీసులు గృహనిర్బంధం చేశారు. దీంతో పెద్ద ఎత్తున కోటంరెడ్డి అభిమానులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు చేరుకున్నారు. అక్కడ భారీగా పోలీసులను మోహరించారు.

**పోలీసులు ఎంతసేపు కాపలా ఉంటారు?: కోటంరెడ్డి** – జలదీక్షకు పోలీసులు అనుమతి ఇచ్చే వరకు ఇంటి బయటే కూర్చొంటానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తేల్చిచెప్పారు. తన నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి నాలుగేళ్ల నుంచి పోరాటం చేస్తున్నానని చెప్పారు. పోలీసులు గృహనిర్బంధం చేసిన నేపథ్యంలో మీడియాతో ఆయన మాట్లాడారు. వంతెన నిర్మాణం కోసం పొట్టేపాలెం కలుజు వద్ద శాంతియుతంగా నిరసన చేస్తానని చెప్పానని.. 10 రోజులుగా పోలీసులను అనుమతి కోరుతున్నట్లు తెలిపారు. తన నిరసనను అడ్డుకోవడం సరికాదని.. ఎంత సేపు పోలీసులు కాపలా ఉంటారని కోటంరెడ్డి ప్రశ్నించారు.

# అవనిగడ్డ నియోజకవర్గ వైసీపీకి బిగ్ షాక్..




కృష్ణాజిల్లా: అవనిగడ్డ నియోజకవర్గంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ నియోజకవర్గం కీలకనేత పరుచూరి సుభాష్ చంద్ర బోస్.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు చూపు లేని ప్రభుత్వ విధానాలతో విసిగి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఘంటసాల, చల్లపల్లి మండలాలను ప్రభావితం చేయగల నేత పార్టీని వీడటంతో ఆ పార్టీ శ్రేణులు ఆందోళనలో ఉన్నారు. జగన్మోహన్ రెడ్డితో సుభాష్ చంద్రబోస్ కలసి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసి జగన్‌కు ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిలా జగన్ పరిపాలన చేస్తారని ఆశిస్తే మోసపు మాటలతో ప్రజలను వంచించారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహ నిర్మాణంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పేదల బ్రతుకు భారం కావడంతో పార్టీని విడుతున్నానని ఆయన ప్రకటించారు. కాగా సుభాష్ చంద్రబోస్‌తో పాటు ఆయన అనుచరులు, 50 మంది ముఖ్య నేతలు వైసీపీని వీడుతున్నారు.

# మోదీ మచ్చలేని పాలనతో ఆదర్శంగా నిలుస్తున్నారు..



విజయవాడ: తొమ్మిదేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మచ్చ లేని పాలనతో ఆదర్శంగా నిలుస్తున్నారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కొనియాడారు. బీజేపీ 42వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను సోము వీర్రాజు ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1951 అక్టోబర్‌లో భారతీయ జనసంఘ్ ఏర్పడిందని, 1980 ఏప్రిల్‌లో బీజేపీగా రూపొందిందన్నారు. యోగా దినోత్సవాన్ని ఇంటర్నేషనల్ డేగా గుర్తించడమే కాకుండా విశ్వగురుగా మారిందని సోమువీర్రాజు అన్నారు. ప్రపంచదేశాలలో శాటిలైట్‌కు సంబంధించిన అనేక యంత్రాలు సముద్రంలో పడిపోతే... అటువంటి వాటిని కూడా భారతదేశం కనుక్కునే స్థాయికి ఎదిగిందన్నారు. డిఫెన్స్‌లో రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాలకు మన దేశం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. లక్షల కోట్లు ఆయుర్వేద మందులను ప్రపంచ దేశాలకు అందిస్తున్నామన్నారు. భారతదేశంలోనే కరోనా వ్యాక్సిన్ తయారు చేసి, 120 దేశాలకు సరఫరా చేస్తున్నామన్నారు. నరేంద్రమోదీ కారణంగా ఇవన్నీ భారతదేశం సాధించిన ఘనతగా సోము వీర్రాజు పేర్కొన్నారు.

## ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న ఊర్వశి

క్షణానికో రంగు మార్చే లక్షణాన్ని ఊసరవెల్లితో పోల్చేస్తాం. ఇదే తరహా క్వాలిటీస్ రంగుల మాయా ప్రపంచంలో కొందరికే సాధ్యం. అతికొద్ది మంది జాబితాలో ఉంది ఊర్వశి రౌతేలా. హేట్ స్టోరీ 4 బ్యూటీ నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో సంచలనంగా మారుతోంది. తాజాగా ఊర్వశి షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. ఇందులో ఈ అమ్మడి రూపం పూర్తిగా మారిపోయింది. మేకప్ టూమచ్ గా డామినేట్ చేసిందని కామెంట్లు వినిపిస్తున్నాయి. నిజానికి ఇది ఎవరో కనిపెట్టడం అంత సులువేమీ కాదు. చూడగానే ఊర్వశి అని అనలేం. నిజానికి ఇదే ఫోటోషూట్లో కొన్ని భంగిమల్లో మాత్రమే ఊర్వశి ఒరిజినల్ రూపం కనిపిస్తోంది. ఇక ఇటీవల ఊర్వశి వేగంగా మారిన రూపం చూస్తుంటే షాక్ తగులుతోంది.



ఇంతకుముందు ముద్దుగా బొద్దుగా కనిపించిన ఈ బ్యూటీ ఐశ్వర్యారాయ్ సిస్టర్ లా మెరుపుతీగలా మారింది. తాజా లుక్ లో బ్లాక్ డిజైనర్ డ్రెస్ ధరించిన ఊర్వశి ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. కానీ తన రూపాన్ని డామినేట్ చేసేంతగా మేకప్ ని అద్దిన విధానం విమర్శలను ఎదుర్కొంటోంది. ఇక కొంతకాలంగా ఊర్వశికి అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో ఊహించని రీతిలో ఇలా ప్రయోగాలకు శ్రీకారం చుడుతోందని విమర్శలొస్తున్నాయి. అయినా మరీ ఇంతగా ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న ఊర్వశిని నమ్మేదెలా.. నమ్మి అవకాశమిచ్చేదెలా? అంటూ నిర్మాతలు వాపోతే సన్నివేశం ఎలా ఉంటుందో ఊహించండి! అంటూ కూడా సరదా కామెంట్లు చేస్తున్నారు యూత్. నియోజకవర్గంలో ఊర్వశి హంగామా హేట్ స్టోరి 4 .. గ్రేట్ గ్రాండ్ మస్తీ చిత్రాలతో మత్తెక్కించిన ఊర్వశి త్వరలోనే టాలీవుడ్ లో సందడి చేయబోతోంది. మోడలింగ్ .. బుల్లితెరను ఏలిన ఈ బ్యూటీ అందాల రాణిగా కిరీటం గెలుచుకున్న సంగతి తెలిసిందే. నిజానికి బన్ని నటించిన పుష్పలో ఐటమ్ నంబర్ చేస్తుందని ప్రచారమైనా కానీ అది కుదరలేదు. తాజా నివేదిక ప్రకారం.. బాలీవుడ్ ఐటమ్ బాంబర్ ఊర్వశి రౌతేలా నితిన్ హీరోగా నటిస్తున్న 'మాచర్ల నియోజకవర్గం'లో ట్రీటివ్వనుందని టాక్ ఉంది.

## అరరే.. 'ఖిలాడి' భామను పట్టించుకునే నాథుడే లేడా?

డింపుల్ హయాతి.. ఈ హాట్ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. 2017లో విడుదలైన 'గల్ఫ్' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత యురేక దేవి 2 అభినేత్రి 2 సహా తదితరల చిత్రాల్లో నటించింది. కానీ ఇవేమి ఆమెకు సక్సెస్ ఇవ్వలేకపోయాయి. అలాంటి తరుణంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా హరీష్ శంకర్ తెరకెక్కించిన 'గద్దలకొండ గణేష్'లో ఐటెం సాంగ్ చేసే అవకాశం వచ్చింది. ఈ అవకాశామే ఆమె కెరీర్ టర్న్ అయ్యేలా చేసింది. వరుణ్ తేజ్ తో కలిసి 'జర్ర జర్ర' అంటూ ఐటెం సాంగ్ తో యూట్యూబ్ ను ఓ ఊపు ఊపేసి కావాల్సినంత క్రేజ్ సొంతం చేసుకుంది. ఆపై బాలీవుడ్ కోలీవుడ్ టాలీవుడ్ లో ఒకేసారి మూడు సినిమాలను పట్టేసింది. అందులో ఒకటి 'అత్రంగి రే'.అక్షయ్ కుమార్ ధనుష్ సారా అలీఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం గత ఏడాది ఓటీటీలో



విడుదలైంది. ఇందులో అక్షయ్ సోదరిగా ధనుష్ను ప్రేమించే యువతిగా డింపుల్ బాగానే అలరించింది. ఆ వెంటనే విశాల్ సరసన ఈమె చేసిన 'సామాన్యుడు' మాస్ మహారాజ్ రవితేజకు జోడీగా నటించిన 'ఖిలాడి' చిత్రాలు ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద ఘోరంగా బోల్తా పడ్డాయి. ముఖ్యంగా వీటిలో ఖిలాడిపై డింపుల్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇందులో హద్దులు మీరి అందాలు కూడా ఆరబోసింది. కానీ ఏం లాభం.. భారీ అంచనాల నడుమ రిలీజ్ అయిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో పూర్తిగా విఫలం అయింది. వరసగా రెండు ఫ్లాపులు పడటంతో.. ఇప్పుడు డింపుల్ కు అవకాశాలే కరువయ్యాయి. దీంతో ఈ బ్యూటీ సోషల్ మీడియా వేదికగా అందాల ఆరబోతకు తెర లేపింది. ఎప్పటికప్పుడు హాట్ హాట్ ఫొటో షూట్లతో కుర్రాళ్ళకు నిద్ర పట్టకుండా చేస్తుంది. అయినప్పటికీ.. ఆఫర్లు మాత్రం రావడం లేదట. ఖిలాడి విడుదలై రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు డింపుల్ నుంచి ఒక్క కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్మెంట్ కూడా రాలేదు. దీంతో ఈ భామను పట్టించుకునే నాథుడే లేడంటూ ప్రచారం మొదలైంది. మరి డింపుల్ కు నిజంగానే అవకాశాలు రావడం లేదా..? లేక మంచి కథల కోసం వెయిట్ చేస్తుందా..? అన్నది తెలియాల్సి ఉంది.




## సమంత వార్నింగ్.. రష్మిక రియాక్షన్ తో క్లారిటీ!





నటి సమంత నిన్నటి రోజున ఓ స్వీట్ వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'నా మౌనం అజ్ఞానం అని.. నా సైలెన్స్ అన్నిటికి అంగీకరిస్తున్నానని.. నా దయని బలహీనత అని అనుకోకండి. దయాగుణానికి కూడా ఓ చివరి డేట్ ఉంటుంది. జస్ట్ చెప్తున్నాను అంతే' అంటూ ఓ ట్వీట్ చేసింది. ఈ ట్వీట్ ఇంటర్నెట్ ని షేక్ చేసింది. ఎప్పుడూ కూల్ గా ఉండే సమంత ఒక్కసారిగా ఇలా లేచింది? ఏంటి అంటూ అంతటా చర్చకొచ్చింది. ఈ ట్వీట్ ఎవర్ని ఉద్దేశించి పెట్టినట్లు? సోషల్ మీడియా జనాల్నా? లేక తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ మాజీ గురించా? అంటూ కొన్ని రకాల ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అయితే ఈ ట్వీట్ ని నేషనల్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్న లైక్ చేసింది. పవర ఎమోజీతో పదం అంటూ తన ట్వీట్ కి రియాక్షన్ ఇచ్చింది. ఇలా సమంతకు మద్దతిచ్చిన ఏకైక మహిళా సెలబ్రిటీల కూడా రష్మిక కావడం విశేషం. చాలా మంది మహిళలు ఈ ట్వీట్ పై పాజిటివ్ గా స్పందించారు కానీ రష్మిక పవర్ ఎమోజీని జోడించడం చర్చకొస్తుంది. సోషల్ జనాలు రష్మిక గతాన్ని తవ్వడం మొదలు పెట్టారు. రష్మిక మందన్న ని కన్నడ ఇండస్ట్రీకి తీసుకొచ్చి హీరోయిన్ ని చేసింది రక్షిత్ శెట్టి. ఆ తర్వాత అతనితోనే రష్మి క ప్రేమలో పడింది. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఎంగేజ్ మెంట్ కూడా చేసుకున్నారు. పెళ్లి ముహూర్తం కూడా ఫిక్స్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఇంతలో ఇద్దరి మధ్య మనస్పర్ధలు తలెత్తాయని విడిపోతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో రష్మికదే తప్పంతా అని నెటి జనులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. పెద్ద హీరోయిన్ అయ్యే సరికి రష్మిక కి- రక్షిత్ శెట్టి నచ్చలేదా? అంటూ కామెంట్లు పోస్ట్ చేసారు. భారీ ఎత్తున ట్రోల్ చేసారు. కానీ వీటిని రష్మిక లైట్ తీసుకుంది. అలాగే సమంత కూడా చైతన్యతో విడిపోయిన తర్వాత ఇలాగే విమర్శలకు గురైంది. ఈ నేపథ్యంలో ట్రోలర్స్ ని ఉద్దేశించే సమంత అలా వార్నింగ్ ఇచ్చిందని..దానికి రష్మిక పవర్ అని రియాక్షన్ ఇచ్చినట్లు గుస గుస వినిపిస్తుంది. కాగా సమంత ట్వీట్ పై ఆమె అభిమానులు మద్దతుగా నిలిచారు. మీరు ఏదో ఒక రోజు మాట్లాడాలని కోరుకుంటున్నాం. నిజం చెప్పి అందరి నోళ్లు మూయించాలి. మీరు బలమైన నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారు. ప్రతీ రోజు మీరు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా అని పోస్ట్ పెట్టారు. వారికి కావాల్సింది మీ దృష్టి మాత్రమే. దయచేసి ఆ ఛాన్స్ ఇవ్వకండి. వారు మీ దృష్టికి అనర్హులు. వాటిని పట్టించుకోకండి అని రాసుకొచ్చారు.

## పూల్ సైడ్ వాటర్ బేబీస్ తుంటరి వేషాలు







నార్త్ సౌత్ అనే విభేధం లేకుండా అన్నిచోట్లా వేవ్స్ క్రియేట్ చేస్తున్న నలుగురు ముద్దుగుమ్మలు కుర్రకారుకు సమ్మర్ ట్రీట్ ఇచ్చేందుకు రెడీ గా ఉన్నారు. వాటర్ బేబీస్ గా పూల్ సైడ్ ట్రీట్ తో కళ్లు తిప్పుకోనివ్వని ట్రీటిస్తున్నారు. ఇంతకీ ఎవరా ముద్దుగుమ్మలు.. అంటే? ఇలియానా-రష్మిక మందన్న- అనన్య పాండే- సోనాల్ చౌహాన్.. వాటర్ బేబీలుగా గుండెల్లో హీట్ పెంచారు. తాజాగా ఈ ముద్దుగుమ్మల పూల్ సైడ్ ట్రీట్ గురించి పరిశీలిస్తే.. ఇవిగో ఈ ఫోటోలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వేసవి మంటలు పెట్టేస్తుంటే పూల్స్ వెతుకుతున్నారు అందాల కథానాయికలు. వేడిని తట్టుకునేందుకు బాలీవుడ్ దివాస్ వాటర్ బేబీలుగా మారుతున్నారు. పనిలో పనిగా బికినీ లతో దుమారం రేపేందుకు.. బహుశా ఉత్తమ సమయమిదని భావిస్తున్నారు. రష్మిక మందన్న నుండి అనన్య పాండే వరకు.. వెటరన్స్ లో ఇలియానా - సోనాల్ సైతం ఈ తరహా ట్రీటిస్తున్నారు. భామలంతా మేజర్ పూల్ గోల్స్ ఇస్తున్నారు. రష్మిక మందన్న రిఫ్రెష్ అయ్యేందుకు ఈత కోసం కొలనులోకి దూకింది. కానీ ఒంటి కాలిపై దూకింది. అయితే నీటిలో ఈత రాని చేప పిల్లలా ఎలా బేలగా కనిపిస్తోందా కదా? అనన్య పాండే టినీ బికినీలో ఒదిగిపోయి ఎంతో తాధాత్మ్యంతో తన అభిమానులను ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం ఈ బికినీ ఫోటోగ్రాఫ్స్ ని లైగర్ ఫ్యాన్స్ వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఇలియానా డి క్రజ్ ప్రియుడు ఆండ్రూ నీబోన్ నుంచి దూరమైనా కానీ తన ఆసక్తులను వదులుకోలేదు. ఈ బ్యూటీ కూడా తన సంతోషకరమైన పూల్ సైడ్ ట్రీట్ పై ఫోటోలను షేర్ చేసింది. టోన్డ్ బాడీని టాన్ తో మింగిల్ చేయడం ఇలియానా ప్రత్యేకత అని పదే పదే ప్రూవ్ చేస్తోంది. దిశా పటాని అగ్గి రాజేసే ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టదు. కొన్ని రోజుల క్రితం దిశా పటానీ ఈ బికినీ ఫోటోగ్రాఫ్ ని షేర్ చేయగా అంతర్జాలంలో దుమారం రేపింది. తన హాట్ నెస్ తో ఇంటర్నెట్ ను బ్రేక్ చేసింది. సోనాల్ చౌహాన్ తన బీచ్ వాకేలో బంచ్ ఆఫ్ ఫటోగ్రాఫ్స్ తో విరుచుకుపడింది. బికినీలో సోనాల్ ఎప్పుడూ నిరాశపరచదు. ప్రస్తుతం ఈ బ్యూటీ ఎఫ్ 3తో పాటు పలు చిత్రాల్లో నటిస్తోంది. ప్రతిసారీ బికినీలో అలరించేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదట. మిలింద్ సోమన్ భార్య అంకితా కొన్వార్ తన బీచ్ హాలిడే నుండి త్రోబాక్ ఫోటోని పంచుకోవడం ద్వారా తన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భామలంతా బికినీ ఫెస్టివల్స్ లో బిజీ గా ఉన్నారు. వాటర్ బేబీస్ గా రికార్డులు తిరగరాయాలన్న కసితో ఉన్నారు. ఇక వీళ్లకు తోడు సారా అలీఖాన్ - జాన్వీ కపూర్- కియరా అద్వాణీ- అనన్య పాండే తదితర హాట్ గాళ్స్ కూడా ఇటీవల తాము కూడా వాటర్ బేబీస్ అని నిరూపించారు.

## గ్లామర్ పాత్రలు చేయకపోవడానికి కారణం అదే: కీర్తి సురేష్

సినీ ఇండస్ట్రీలో కొందరు హీరోయిన్లు గ్లామర్ పాత్రలను ఎంచుకుని ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తుంటే.. కొందరు ముద్దుగుమ్మలు మాత్రం నటనకు మంచి స్కోప్ ఉన్న రోల్స్ ని సెలెక్ట్ చేసుకుంటూ స్టార్స్ గా ఎదుగుతున్నారు. ఈ రెండో రకానికి చెందిన హీరోయిన్ల జాబితాలో కీర్తి సురేష్ ఒకరు. మలయాళ సినీనిర్మాత సురేష్ కుమార్ ప్రముఖ నటి మేనక కుమార్తె అయిన కీర్తి సురేష్.. చదువుకుంటూనే బాల్య నటిగా పలు సినిమాలు చేసింది. 2013లో వచ్చిన 'గీతాంజలి' అనే మలయాళ మూవీతో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చిన కీర్తి.. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన 'నేను శైలజ'తో తొలిసారి తెలుగు సినీ ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత వరుస సినిమాలు చేస్తూ




గుర్తింపు పొందిన ఈమె.. 'మహానటి'తో స్టార్ స్టేటస్ ను అందుకుంది. సావిత్రి క్యారెక్టర్లో కీర్తి సురేష్ అద్భుతంగా జీవించింది. సావిత్రి తెరపైన నటిస్తుందా అనే ఫీలింగ్ను ప్రేక్షకులకు కలిగించింది. దీంతో సాధారణ ప్రేక్షకులు అభిమానులే కాదు విమర్శకులు సైతం కీర్తి సురేష్ పై ప్రశంసల వర్షం కురిపించారు. అయితే ఈ అందాల చందమామ ఇండస్ట్రీలోకి వచ్చి చాలా కాలమే అయినా.. ఇప్పటి వరకు గ్లామర్ పాత్రలను చేసింది లేదు. ఏ సినిమాలోనూ హద్దులు మీరి అందాలు ఆరబోసిందీ లేదు. కేవలం నటనకు ప్రాధాన్యత ఉండే పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తోంది. అయితే గ్లామర్ పాత్రలు చేయకపోవడానికి కారణం ఏంటో కీర్తి సురేష్ చెప్పేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. స్కిన్ షో పాత్రల గురించి మాట్లాడిం ది. 'నటిగా నా అభినయం ప్రేక్షకులు ఇష్టపడాలని ఎప్పుడూ కోరుకుం టాను. అదృష్టవశాత్తు నటనకు ఆస్కారమున్న పాత్రలే నన్ను వెతుక్కుం టూ వస్తున్నాయి. వాటితోనే మీ ఆదరణ పొందుతున్నాను. గ్లామర్ పాత్రలు నా మొదటి ప్రాధాన్యం కానేకాదు. అయినా తెరపై ఎలా కనిపించాలి అనే విషయంలో నాకు కొన్ని హద్దులు ఉన్నాయి.

వాటిని చెరపలేను. అందు కారణంగానే గ్లామర్ పాత్రలను చేయడం లేదు' అంటూ కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. కాగా సినిమాల విషయానికి వస్తే.. తెలుగులో సూపర్ స్టార్ మహేష్ బాబుతో కీర్తి కలిసి నటించిన 'సర్కారు వారి పాట' మే 12న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అలాగే మలయాళంలో ఈమె చేసిన 'చిన్ని' మూవీ ప్రముఖ డిజిటల్ సంస్థ అమెజాన్ ప్రైమ్లో మే 6న రిలీజ్ కాబోతోంది. అంటే వారం గ్యాప్ లోనే కీర్తి సురేష్ రెండు చిత్రాలతో సందడి చేయబోతోందన్నమాట.

## చెలికత్తెల మధ్యలో రాణివారు కిలకిలలు!

అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఓవైపు కెరీర్ పరంగా బిజీగా ఉన్నా వరుస వెకేషన్లతో రిలాక్స్ మోడ్ లోకి వెళ్లిపోతోంది. జాన్వీ నిరంతర ఫోటోషూట్ల గురించి తెలిసిందే. అల్ట్రా మోడ్రన్ ఫ్యాషనిస్టాగా ఇప్పటికే యూత్ కి కనెక్టయిపోయిన జాన్వీ చాలా రేర్ గానే ట్రెడీషనల్ లుక్స్ లో కనిపిస్తుంది. జిమ్ కి వెళ్లినా..యోగా సెంటర్లో ఉన్నా! టెంప్టింగ్ ఫోటోషూట్లకు కొదవేమీ ఉండదు. యువనటి భంగిమలకు కుర్రాళ్ల గుండెల్లో మంటలు చెలరేగాల్సిందే. ఇన్ స్టా వేదికగా ఆ ఫోటోలు అంతే వైరల్ గా మారుతున్నాయి. ఇది జాన్వాలో ఒక యాంగిల్ మాత్రమే. మరో యాంగిల్ లో జాన్వీ పదహారణాల అమ్మాయిలా ముస్తాబైతే ఎంత అదంగా కనిపిస్తుందో చెప్పాల్సిన పనిలేదు. అప్పుడప్పుడు యువరాణి గెటప్ప్ లో సైతం తళుక్కున మెరవడం జాన్వీ ప్రత్యేకత. తాజాగా




జాన్వీ యువరాణి ఆహార్యం లో ఓ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారియింది. చెలికత్తెల మధ్యలో కిలకిలా నవ్వుతూ జాన్వీ ఎంతో అందంగా..ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఓ కవర్ పేజీ కోసం జాన్వీ ఇలా అందంగా ముస్తాబై కెమెరాకి ఫోజులిచ్చింది. ఈ ఫోటో సెషన్ కోసం ఏకంగా పురాతన సెట్ నే డిజైన్ చేసినట్లు కనపిస్తుంది. చెలికత్తెల కట్టుబొట్టు ఆహార్యం అద్భుతంగా ఉన్నాయి. మధ్యలో యువరాణి డిజైనర్ దుస్తులు ధరించి చెలికత్తెలుతో కబుర్లు చెబుతూ..నవ్వులు పూయిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. నెటి జనులు జాన్వీ అందాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో దోస్తానా-2 లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన గుడ్ లక్ జెర్రీ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది. మిలీ అనే మరో చిత్రంలో కూడా నటిస్తుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే వదులుకోవడానికి ఎంత మాత్రం సిద్దంగా లేదు. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ఈ విషయంలో తండ్రీ బోనీకపూర్ వెనుకుండి ప్రోత్సహిస్తున్నారు.



# కోటి పరీక్షలు పూర్తి చేసుకున్న కంటివెలుగు

## మంత్రి హరీశ్‌రావు అభినందనలు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం కోటి పరీక్షలు పూర్తి చేసుకుంది. ఈ ఏడాది జనవరి 18న ప్రారంభమైన రెండో విడత కంటి వెలుగు పథకం ద్వారా కేవలం 50 రోజుల్లోనే కోటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివపేటలోని కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించిన మంత్రి హరీశ్ రావు బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. కేక్ కట్ చేసి అక్కడి సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ... కోటి కంటి పరీక్షలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ రోజు చాలా గొప్ప రోజు అని.. కంటి వెలుగు ద్వారా 29 లక్షల మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గమనించి, కంటి బాధల నుంచి విముక్తి కల్పించేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకం తీసుకొచ్చారని మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఈ తరహా కార్యక్రమంలో ప్రపంచంలో ఎక్కడా లేదని ఆయన స్పష్టం చేశారు. ఊరు ఊరు వాడకు డాక్టర్లు, యంత్రాలను పంపించి నిరుపేదలకు కంటి వెలుగు ప్రసాదించారని చెప్పారు. ఈ పథకాన్ని ప్రతిపక్షాలు సైతం మెచ్చుకున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాల సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, మాన్‌సింగ్ కూడా మెచ్చుకున్నారని గుర్తు చేశారు. 50 రోజుల్లోనే కోటి కంటి పరీక్షలు పూర్తి చేశారని అన్నారు. 1500 మంది కంటి వెలుగు టీమ్స్ కష్టపడి పని చేశారని అన్నారు. 53 లక్షల మంది మహిళలు, 47 లక్షల మంది పురుషులకు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 7 వేల గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు పరీక్షలు చేశామన్నారు. 55 శాతం గ్రామాల్లో కంటి పరీక్షలు పూర్తి చేసినట్లు చెప్పారు. దగ్గర చూపుతో ఇబ్బంది పడుతున్న 16.50 లక్షల మందికి, దూరపు చూపు సమస్యతో బాధపడుతున్న 12.50 లక్షల మందికి కంటి అద్దాలు అందజేశామని మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో 84 శాతం కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అవుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు తెలిపారు. వైద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. తెలంగాణలో వైద్యరంగం మెరుగ్గా ఉందని నీతి ఆయోగ్ చెప్పిందని మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లె దవాఖానాలు, మున్సిపాలిటీల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించబోతున్నామని తెలిపారు. టీ డయాగ్నోస్టిక్ సెంటర్ల ద్వారా 57 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. రాష్ట్రానికి ఒక్క ఎయిమ్స్ కేటాయించి కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుందని.. అదే తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాదిలోనే కొత్తగా 9 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.




జనగామ టౌన్: జనగామలో విషాదం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ (55) దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తొలుత భార్య స్వరూప(50) ఉరివేసుకుని చనిపోగా.. గంటల వ్యవధిలోనే ఎస్సై కూడా తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై కాసర్ల శ్రీనివాస్ గత ఏనిమిదేళ్లుగా జనగామ పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున ఆయన భార్య స్వరూప బాత్‌రూమ్‌కి వెళ్లి కిటికీకి చున్నీతో ఉరివేసుకున్నారు.

ఎస్సై ఉదయం నిద్రలేచాక బాత్‌రూమ్‌కి వెళ్లి చూసేసరికి భార్య విగతజీవిగా కనిపించారు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఇంటికి వచ్చి ఎస్సై శ్రీనివాస్‌ను పరామర్శించారు. అనంతరం ఎస్సై నివాసానికి ఏసీపీ దేవేందర్‌రెడ్డి, పట్టణ ఇన్‌ఛార్జ్ సీఐ నాగబాబు చేరుకుని పరిశీలించారు. భార్య మృతికి గల కారణాలను ఎస్సై శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులు అడిగి తెలుసుకున్నారు. అప్పటి వరకు బెడ్‌రూమ్‌లో ఉన్న ఎస్సై.. వాష్‌రూమ్‌కి అని చెప్పి లోపలికి వెళ్లి ఒక్కసారిగా తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నారు. కాల్పుల శబ్దం విని అప్పటికే ఇంట్లో ఉన్న ఏసీపీ, సీఐ బాత్‌రూమ్‌కి వెళ్లి చూడగా.. ఎస్సై కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు.

**రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది: డీసీపీ సీతారామ్ –** ఎస్సై దంపతుల ఆత్మహత్య దురదృష్టకరమని డీసీపీ పి.సీతారామ్ అన్నారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సై దంపతులకు ఇద్దరు పిల్లలున్నారని.. వారు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారని చెప్పారు.

జనగామలో ఎస్సై దంపతులు మాత్రమే నివాసముంటున్నారని తెలిపారు. బుధవారం రాత్రి శ్రీనివాస్, స్వరూప మధ్య కుటుంబ, ఆర్థిక సంబంధిత విషయాలపై గొడవ జరిగిందన్నారు. ఎస్సై దంపతుల ఆత్మహత్యపై పూర్తిస్థాయిలో విచారణ జరిగాక మిగిలిన విషయాలు వెల్లడిస్తామని డీసీపీ చెప్పారు.




## సీపీ సార్.. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ అనుమతి లేదు.. కమిషనర్‌ను ఆపిన మహిళా కానిస్టేబుల్

**పదో తరగతి పరీక్ష పత్రాలు లీకేజీ కలకలం నేపథ్యంలో ఎల్బీనగర్‌లోని పరీక్ష కేంద్రాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్ పరిశీలించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కి తావులేకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే సమయంలో మొబైల్ తీసుకుని వెళ్తున్న కమిషనర్ చౌహాన్‌కు.. పరీక్షా కేంద్రంలోకి మొబైల్స్ అనుమతి లేదంటూ కల్పన అనే మహిళా కానిస్టేబుల్ ఆయన్ను ఆపారు. వెంటనే ఆయన తన సెల్ ఫోన్‌ను ఆమెకు అప్పగించారు. కల్పన చేసిన పనికి సీపీ అభినందించి రివార్డ్ ప్రకటించారు. ఏ అధికారి వచ్చినా ఇలాంటి పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆయన సూచించారు.**




హైదరాబాద్: తెలంగాణ గురుకులాల్లో 9,231 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు గురుకుల విద్యా సంస్థల నియామక బోర్డు 9 నోటిఫికేషన్లు జారీ చేసింది.

డిగ్రీ కాలేజీల్లో 868 అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. జూనియర్ కళాశాలల్లో 2008 లెక్చరర్లు, పాఠశాలల్లో 1276 పీజీటీ, 434 లైబ్రేరియన్, 275 ఫిజికల్ డైరెక్టర్, 134 ఆర్ట్స్, 92 క్రాఫ్ట్, 124 మ్యూజిక్, 4020 టీజీటీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. ఈనెల 12 నుంచి వన్ టైం రిజిస్ట్రేషన్.. 17 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ మల్లయ్యభట్టు తెలిపారు.

# సంజయ్ అరెస్ట్‌పై కౌంటర్ దాఖలు చేయండి.. పోలీసులకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్: భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రిమాండ్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సంజయ్‌కు కోర్టు సూచించింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 10కి వాయిదా వేసింది. 41ఏ నోటీసు ఇవ్వకుండా సంజయ్‌ను అరెస్ట్ చేశారంటూ సంజయ్ తరఫు న్యాయవాదులు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలుచేశారు. హనుమకొండ కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరారు. అత్యవసర విచారణ జరపాలని న్యాయస్థానాన్ని కోరారు. న్యాయవాదుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్.. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత విచారణ జరిపారు. వరంగల్ కమిషనరేట్ కమలాపూర్‌లో జరిగిన హిందీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సంజయ్‌ను పోలీసులు ప్రధాన నిందితుడిగా చేర్చిన విషయం తెలిసిందే. ఆయన ప్రోద్బలంతోనే మిగిలిన నిందితులు ప్రశ్నపత్రాన్ని పరీక్షకేంద్రం నుంచి దొంగతనంగా సేకరించి వాట్సప్ ద్వారా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారని ఆరోపించారు. ఆయనపై 120 (బి), 420, 447, 505 (1)(బి) ఐపీసీ, 4(ఎ), 6, రెడ్‌విత్ 8 ఆఫ్ టీఎస్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్‌ప్రాక్టీసెస్) యాక్ట్-1997, సెక్షన్ 66-డి ఐటీ యాక్ట్-2008 కింద కేసు నమోదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌లో సంజయ్‌ను అరెస్టు చేసినప్పటి నుంచి బుధవారం సాయంత్రం జడ్జి ఎదుట హాజరుపరిచేవరకు అడుగడుగునా ఉద్రిక్తతలు, నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బుధవారం కోర్టుకు సెలవు కావడంతో పోలీసులు సంజయ్‌ను సాయంత్రం సుమారు 6.50 గంటలకు హనుమకొండ జిల్లా ప్రధాన మున్సిఫ్ మేజిస్ట్రేట్ నివాసానికి తీసుకెళ్లి హాజరుపరిచారు. పూర్వాపరాలను పరిశీలించాక.. సంజయ్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ జిల్లా ప్రధాన మున్సిఫ్ మేజిస్ట్రేట్ రాపోలు అనిత ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాత్రి 8.30 గంటలకు పోలీసులు సంజయ్‌ను కరీంనగర్ కారాగారానికి తరలించారు. తాజాగా ఆయన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది.

# బండి సంజయ్‌కు రాష్ట్రం మొత్తం అండగా ఉంటుంది...




హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పార్టీ బీజేపీ అని, ఉద్యమంలో 1200 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబం మాత్రం వచ్చిన తెలంగాణలో మేమే అధికారంలో ఉండాలనుకుంటున్నారని విమర్శించారు. బండి సంజయ్‌కు రాష్ట్రం మొత్తం అండగా ఉంటుందని, సంజయ్‌ను అరెస్టు చేసినంత మాత్రాన పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. బండి సంజయ్ అరెస్టు సందర్భంగా కార్యకర్తలే కాదు, సామాన్య ప్రజలు కూడా అరెస్టును అడ్డుకున్నారని కిషన్ రెడ్డి అన్నారు. ప్రగతిభవన్ తెలంగాణ ద్రోహులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై కేసులు పెట్టిన వారు మంత్రులుగా ఉన్నారని, తెలంగాణ వద్దు అంటూ చెప్పిన మజ్లిస్ పార్టీ నేడు బీఆర్ఎస్‌కు ఫ్రెండ్లీ పార్టీగా మారిందన్నారు. సంజయ్ కోసం రాజకీయ, న్యాయ పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించే వరకు ప్రతి ఒక్కరు పోరాటం చేస్తారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# బండి సంజయ్ పిటిషన్‌పై విచారణ.. అది లీకేజీ ఎలా అవుతుందన్న హైకోర్టు

హైదరాబాద్ : బండి సంజయ్ లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. హనుమకొండ కోర్టు డాకెట్ ఆర్డర్‌ను సస్పెండ్ చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అరెస్ట్ సమయంలో పోలీసులు 41ఏ నోటీస్ ఇవ్వలేదని పేర్కొన్నారు. రిమాండ్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ సోమవారానికి వాయిదా పడింది. ప్రతివాదులకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే బండి సంజయ్‌పై ఉన్న ఆరోపణలు ఏంటని హైకోర్టు ప్రశ్నించింది. పేపర్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాక లీకేజ్ ఎలా అవుతుందని అడిగింది. లోయర్ కోర్టులో ఉన్న బెయిల్ పిటిషన్‌పై ఈ రోజు నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. బండి సంజయ్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతిచ్చింది.

**బండి సంజయ్ లంచ్ మోషన్‌లో కీలక అంశాలు..** – హనుమకొండ కోర్ట్ ఇచ్చిన డాకెట్ ఆర్డర్ సస్పెండ్ చేయాలి – తక్షణమే సంజయ్‌ను విడుదల చేయాలి – అరెస్ట్ సమయంలో పోలీసులు 41-ఎ నోటీస్ ఇవ్వలేదు – అరెస్టు సమయంలో పోలీసులు మ్యాన్ హ్యాండిలింగ్ చేశారు – కరీంనగర్ నుండి 150 కిలోమీటర్లు దూరం లో ఉన్న బొమ్మలరామారంకు తరలించారు – బొమ్మలరామారంకు ఎందుకు తరలించారో తెలియదు. – ఇదే బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌పై గతంలో నక్సలైట్లు దాడి చేశారు – రాత్రంతా బొమ్మలరామారం పిఎస్‌లోనే అక్రమంగా నిర్బంధించారు – వైద్య పరీక్షల కోసం బొమ్మలరామారం నుండి 70 కిలోమీటర్ల లో ఉన్న పాలకుర్తి గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించారు – పాలకుర్తి నుండి మళ్లీ హన్మకొండకు తరలించారు – కరీంనగర్ నుండి వరంగల్‌కు కేవలం 60 కిలోమీటర్ల దూరం ఉంది – వేధింపులకు గురి జేయాలనే కిలోమీటర్ల కొద్ది తిప్పారు – వరంగల్ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్టు చేశారు – బీజేపీపై కుట్రలో భాగంగానే కేసులో ఇరికించారు – రిమాండ్ రిపోర్టులో సైతం నేరం చేసినట్టు ఎక్కడ పొందపర్చ లేదు – అరెస్టు సమయంలో సిఆర్పిసి 50 నిబంధనలను పోలీసులు పాటించలేదు – పోలీస్ కస్టడీలోనూ దురుసుగా ప్రవర్తించారు – మొన్న రాత్రి అరెస్టు చేస్తే నిన్న సాయంత్రం 6:02 కు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు – బీఆర్ఎస్ పార్టీ చెప్పినట్టు పోలీసులు ప్రవర్తిస్తున్నారు – హనుమకొండ కోర్ట్ ఇచ్చిన డాకెట్ ఆర్డర్‌ను సస్పెండ్ చేయాలి

# బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఆయన పీఏలకు నోటీసులు



వరంగల్ : టెన్త్ పేపర్ లీకేజీ కేసులో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తో పాటు ఆయన ఇద్దరు పీఏలకు వరంగల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించిన రిమాండ్ రిపోర్టులో బండి సంజయ్‌ను ఏ1గా, బూర ప్రశాంత్‌ను ఏ2గా చేర్చిన సంగతి తెలిసిందే. అయితే ఏ2 ప్రశాంత్.. బండి సంజయ్‌తో పాటు ఈటల రాజేందర్‌కు, ఆయన ఇద్దరు పీఏలు రాజు, నరేందర్‌కు కూడా హిందీ ప్రశ్నపత్రం వాట్సాప్ ద్వారా పంపాడు. దీంతో వారి పేర్లను కూడా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్‌తో పాటు ఆయన ఇద్దరు పీఏలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

ఈటల రాజేందర్, ఆయన పీఏలు రాజు, నరేందర్ వాంగ్మూలాన్ని కూడా నమోదు చేస్తామని వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. అయితే హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ నుంచి హిందీ ప్రశ్నపత్రం లీకైన సంగతి తెలిసిందే. కమలాపూర్ బాయ్స్ స్కూల్ నుంచి తెలుగు బిట్ పేపర్, హిందీ ప్రశ్నపత్రం లీక్ కావడంతో.. ఆ స్కూల్‌నే ఎందుకు ఎంచుకున్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హుజురాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈటల రాజేందర్‌ను విచారించి మరింత సమాచారాన్ని రాబట్టే అవకాశం ఉంది.

# హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు.. కొండగట్టుకు వేలాదిగా తరలివస్తున్న భక్తులు



మల్యాల : జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో జరుగుతున్న హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. నేడు చిన్న జయంతి సందర్భంగా ఇప్పటికే రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది దీక్షాపరులు, భక్తులు చేరుకుంటున్నారు. గుట్ట కింది నుంచి పురాతన మెట్ల దారి, ఘాట్ రోడ్డు, నాచుపల్లి గ్రామాల మీ దుగా అంజన్న సన్నిధానానికి వస్తున్నారు. కాగా అర్ధరాత్రి 12 గంటల తర్వాత భక్తులు మాల విరమణకు పోటెత్తారు. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం పలువురు దీక్షాపరులు స్వామి సన్నిధిలో మాల విరమణ చేశారు. అర్చకులు ఉదయం నాలుగు గంటలకు ఆలయాన్ని తెరిచి, దీక్షా విరమణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాత్రి ఆలయ పరిసరాల్లోనే నిద్రించిన భక్తులు మాల విరమణ మండపానికి ఒక్కసారిగా తరలివచ్చారు. ఉదయం నాలుగు గంటల నుంచి ప్రారంభమైన మాల విరమణ ఏడు గంటల వరకు నిరాటంకంగా కొనసాగింది. స్వామి వారి జయంతి గురువారం రోజున లక్షలాది మంది భక్తులు కొండగట్టుకు చేరుకొని తాము స్వీకరించి అత్యంత కఠిన నియమాలతో ఆచరించిన మండల, అర్ధమండల, ఏకాదశ దీక్షలను స్వామి సన్నిధిలో విరమిస్తున్నారు. ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్, పాలకమండలి చైర్మెన్ తిరుక్కోవెల మారుతీస్వామి, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస శర్మ, ఆలయ ఏఈ లక్ష్మణ్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# బీఆర్ఎస్ సర్కార్‌పై డీకే అరుణ ఫైర్

హైదరాబాద్: బీఆర్ఎస్ సర్కార్‌పై బీజేపీ నేత, మాజీమంత్రి డీకే అరుణ మండిపడ్డారు. బీజేపీపై కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కుటుంబంపై వస్తున్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మరల్చటానికే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. తనంతట తానుగా ఫోన్లు ఇవ్వలేదని, ఈడీ అడిగితేనే ఎమ్మెల్సీ కవిత సెల్ ఫోన్లు తీసుకెళ్ళారన్నారు. బండి సంజయ్ ఫోన్‌పై పోలీసులు అవాస్తవాలు మాట్లాడుతున్నారని డీకే అరుణ అన్నారు. ఈడీ విచారణలో ఏం జరిగిందో కవితకు ధైర్యముంటే బయటకు చెప్పాలన్నారు. ఎన్డీటీవీలో వచ్చిన వార్త నుంచి దృష్టి మరల్చేందుకే బూతులు మాట్లాడటంలో తన తండ్రి కేసీఆర్‌ను కేటీఆర్ మించిపోయారన్నారు. చేసిన పాపం కేసీఆర్‌ను వదలదన్నారు. బిడ్డకో న్యాయం.. ఇతరులకు మరొక న్యాయమా? అంటూ ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలపై కవితను విచారణ చేస్తే బీజేపీకి ఎలా ఆపాదిస్తారని నిలదీశారు. బండి సంజయ్ అరెస్ట్ తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ఇప్పటివరకు చర్యలెందుకు తీసుకోలేదని డీకే అరుణ ప్రశ్నించారు. ప్రశ్న పత్రాల లీక్ ఘటనపై మాట్లాడని మంత్రులు.. బండి సంజయ్‌పై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గ్రూప్ వన్ సహా.. ప్రతి ప్రశ్నా పత్రం లీక్ అవుతుందన్నారు. పిచ్చోని చేతిలో రాయి.. కేసీఆర్, కేటీఆర్‌కే వర్తిస్తుందన్నారు. పిచ్చోని చేతిలో రాయిని పెట్టామని ప్రజలు మాట్లాడుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ తీరును దేశ ప్రజలంతా గమనిస్తున్నారని, పోలీస్ ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డీకే అరుణ కోరారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com